




ఉష్ణోగ్రత (అంచనా) 20-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	38	27
తెనాలి	38	28
నరసరావుపేట	38	27
బాపట్ల	39	28
రెంటచింతల	37	27
చీరాల	39	28

స్వర్ణ పంచాయతీలు.. వేగవంతం



చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రజలకు అందుబాటులోకి పల్లె వివరాలు

వివాదాలు లేని గ్రామాలు.. ఆన్‌లైన్‌లోనే పన్నులు

వెబ్‌లోనే వివరాలన్నీ..

స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో గ్రామానికి చెందిన అన్ని వివరాలు ఉంటాయి. గ్రామ ముఖ చిత్రం, ఆ పంచాయతీలోని ఇళ్ల విస్తీర్ణం, హద్దులు, యాజమాని పూర్తి వివరాలు ఉంటాయి. అంతేకాకుండా ఏడాదికి ఎంతపన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్ టవర్లు, పరిశ్రమల వివరాలు ఉంటాయి. పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. అవసరమైన ధృవీకరణ పత్రాలు, అనుమతులు ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చు.

గుంటూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కువగా జరిగే గొడవలన్నీ ఇళ్ల సరిహద్దులకు సంబంధించినవే. ఎప్పుడో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులు ఉన్నా ఆ పంచాయితీ పరిష్కారానికి తరాలు మారాల్సిందే. అటువంటి గొడవలు, సివిల్ వివాదాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చక్కని పరిష్కార మార్గాన్ని ఎన్నుకుంది. స్వర్ణ పంచాయతీ పేరుతో చారిత్రక కార్యక్రమానికి ఊపిరి పోసింది. వాస్తవానికి ఈ కార్యక్రమం గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆరంభమైనా ముందుకు పోవడానికి ఆపసోపాలు పడింది. కూటమి ప్రభుత్వం అదే కార్యక్రమాన్ని జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టిస్తోంది. స్వర్ణ పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా అన్ని వివరాలు ఆన్‌లైన్ లో నమోదు అయితే గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఒక సువర్ణ అధ్యాయం ఆరంభం అవుతుంది. స్వర్ణ పంచాయతీ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. గుంటూరు జిల్లాలో 2,49,067 పాత రసీదులు అసెస్మెంట్లు ఉండగా 1,67,818 అసెస్మెంట్లు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. పల్నాడు జిల్లాలో 389433 అసెస్మెం ట్లు ఉండగా 346902 మంది యజమానులు ఉన్నారు. వారిలో 319138 మంది ఆధార్‌లు అనుసంధానం చేశారు. బాపట్ల జిల్లాలో కూడా ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే...

స్వర్ణ పంచాయతీ పేరుతో అన్ని సేవలను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. ముఖ్యంగా ఇంటి కొలతలు, పన్ను చెల్లింపులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఎవరైతే సదరు ఇంట్లో నివాసం ఉంటున్నారో గమనించి, వారి దస్తావేజులు పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ ఇల్లు ఎంత విస్తీర్ణంలో ఉంది.. కొలతలను పక్కాగా రూపొందించి మ్యాప్ సహా కంప్యూటరైజేషన్ చేస్తారు. దానివల్ల గతంలో మాదిరిగా ఒకరి ఆస్తిని మరొకరు ఆక్రమించడం, దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. ఇంటి పన్ను కూడా ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉండదు.

పన్నులు గల్లంతు..

గతంలో పంచాయతీ కార్యదర్శి రసీదులు ఇచ్చి పన్నులు వసూలు చేసే వారు. వాటిలో కొంత భాగం పక్కదారి పట్టించేవారు. గృహ యజమానుల నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకుని ఒకే పన్ను రెండు మూడు సార్లు వసూలు చేసే వారు. స్వర్ణ పంచాయతీ విధానంలో గృహ యజమాని ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు. ఇంటి పన్ను ఒక వేళ సచివాలయంలో చెల్లించినా దానికి సంబంధించిన రసీదును కంప్యూటర్ నుంచి పొందవచ్చు. ఇంటి పన్ను చెల్లింపు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదవుతాయి కాబట్టి మళ్లీ మళ్లీ చెల్లించాల్సిన అవసరం ఉండదు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అధికారులు

యోగాంధ్రకు.. 9.81 లక్షల మంది

- రేపటి కార్యక్రమానికి విస్తృతంగా ఏర్పాట్లు
- జిల్లా అంతటా ఐదు వేల వేదికల్లో యోగాకు ఏర్పాట్లు
- పోలీసు కవాతు మైదానం, అమరావతిలో పది వేల మందితో
- సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి సుమారు 9.81 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం యోగా దినోత్సవ నిర్వహణపై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షకు కలెక్టర్ అరుణ్‌బాబు హాజరై జిల్లాలో నిర్వహించే కార్యక్రమాల గురించి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా శనివారం ఐదు వేల వేదికలపై జరిగే యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. నరసరావుపేటలోని పోలీసు కవాతు మైదానం, అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం వద్ద 10 వేల మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాపంగా వార్డు, గ్రామ సచివాలయాలు పరిధిలో గుర్తించిన వేదికల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. యోగాంధ్రలో పాల్గొన్న ట్రైనర్లకు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

దూరమైన... కంటి వైద్యం

- సీఎంఈఐ కేంద్రాల తొలగింపు
- కంటి పరీక్షకు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి



వేమూరు సీఎంఈఐ కేంద్రం (ఫైల్ ఫొటో)

వేమూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు కంటి వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించగా వైసీపీ ప్రభుత్వం మార్పులు చేసి దానికి తూట్లుపొడిచింది. 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో సీఎంఈఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు కంటి వైద్యాన్ని చేరువ చేసింది. ఈ కేంద్రాల్లో ప్రతి వ్యక్తి ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకుని కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందించే వారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేశారు. గ్రామీణులు ఎందరో అప్పట్లో కంటి వైద్యం అందుకున్నారు. ఉదాహరణకు ఒక్క వేమూరులోని కేంద్రంలోనే రోజుకు 70 నుంచి 100 మందికి పైగా నెలలో 2000 మందికి పైగా వైద్య సేవలు అందుకునేవారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కేంద్రాల్లో కూడా ఉండేది. తద్వారా గ్రామీణ ప్రజల కళ్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఎందరో పేదలు, వృద్ధులు, ఆపరేషన్లు ద్వారా వెలుగును చూడగలిగారు. అలాంటి విధానాన్ని 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కంటి వెలుగుగా మార్పు చేసింది. ఆయా కేంద్రాల్లో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్లను గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించాలని ఆదేశించింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టి మెరుగైన విధానానికి తూట్లు పొడిచింది. చంద్రబాబు ఆలోచనలకు విరుద్ధంగా సేవలను మార్చడంతో ప్రజలు ఫలితాలను అంతగా అందుకోలేకపోయారు. కూటమి పాలన రావడంతో తిరిగి సీఎంఈఐ కేంద్రాలు పునరుద్ధరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్న తరుణంలో అపోలో కాంట్రాక్టు రద్దైంది. దీంతో ఈ కేంద్రాలను ప్రభుత్వం మూసేసింది. దీంతో గ్రామీణ ప్రజలకు కంటి వైద్యం దూరమైంది. పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఖరీదైన కంటి వైద్యం చేసుకునేందుకు పేదలు ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి సీఎంఈఐ కేంద్రాలను పునః ప్రారంభించేందుకు ఆలోచన చేసి కంటి వైద్య సేవలను చేరువ చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బర్లీ సంబరం

రైతుల ఆనందోత్సాహాల మధ్య కొనుగోళ్లు

పర్చూరులో అట్టహాసంగా మార్క్‌ఫెడ్ కేంద్రం ప్రారంభం

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్న మంత్రి అచ్చెన్నాయుడు

అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర లేక కొందరు.. కొనుగోళ్ల చేయలేక మరికొందరు అల్లాడిపోయారు. కంపెనీల ద్వారా కొనుగోళ్లకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసినా రైతుల్లో ఆందోళన తగ్గలేదు. దీంతో ఎట్టకేలకు నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు సిద్ధమైంది. సీఎం చంద్రబాబు ప్రకటించినట్లుగా బాపట్ల, పల్నాడు, గుంటూరు రైతులకు ఊరట ఇస్తూ గురువారం నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ల కార్యక్రమానికి పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు వేదికగా నిలిచింది. కొనుగోళ్లను ప్రారంభించడానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్చూరుకు రాగా రైతులు ఘనస్వాగతం పలికారు. దాదాపు 500 ట్రాక్టర్లతో పర్చూరులో రైతులు ర్యాలీ నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించేలా కొనుగోళ్ల కార్యక్రమం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనడం అసాధ్యమని విమర్శించిన వారందరికీ ప్రారంభమైన కొనుగోళ్లే సమాధానమని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. పొగాకు కంపెనీల ఉచ్చులో పడి పొగాకు సాగు (మిగతా 4లో)



కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

- ఉపాధ్యాయులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

నరసరావుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మండల పరిధిలోని కేశానుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 100 కి తగ్గకుండా అడ్మిషన్లు జరగాలన్నారు. నెమ్మదిగా నేర్చుకునే పిల్లలపై ఉపాధ్యాయులు ఎక్కువగా దృష్టి సారించి ఓపిగ్గా పాఠాలు బోధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలను పరిశీలించారు. విద్యా మిత్ర కిట్లు అందరికీ అందాయా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అవగాహన లేక.. ఈ-కేవైసీ కాక

రెండువేల మందికి 'తల్లికి వందనం' దూరం



గుంటూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చే సింది. అయితే కొందరికి ఈ పథకం దూరమైంది. ఇందుకు కారణం వారికి ఈ-కేవైసీపై సరైన అవగా హన లేకపోవడమే. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు రెండు వేల మందికి పథకం అందలేదు. గుంటూరు జిల్లాలో 603, బాపట్ల జిల్లా లో 557, పల్నాడు జిల్లాలో 903 మంది ఈ-కేవైసీ చేయించు కోలేదని అధికారులు లెక్కలు తేల్చారు. వారి జాబితాలను సచివాలయాల్లో అం దుబాటు లో ఉంచి ఈ-కేవైసీ వెంటనే చేయించుకోవాలని సమాచారం పంపుతున్నారు. ఈ విషయంపై బుధవారం సచివాలయ సిబ్బందితో టెలీకాన్ఫ రెన్స్ నిర్వ హించిన అధికారులు తక్షణం ఈ-కేవైసీ పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు.

తల్లి లేకపోతే తండ్రి..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 978 మంది విద్యా ర్థులకు తల్లి మరణించటం వల్ల 'తల్లికి వందనం' వర్తించలేదని అధికారులు తేల్చారు. గుంటూరు జి ల్లాలో 340 మంది, బాపట్లలో 226 మంది, పల్నా డు జిల్లాలో 412 మంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారు. తండ్రితో ఈ-కేవైసీ పూర్తి చేయిం చాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

23న సుపరిపాలన -స్వర్ణాంధ్ర

- వెలగపూడిలోని సచివాలయం సమీపంలో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

నేటి నుంచి బోయపాలెంలో పొగాకు కొనుగోళ్లు

- మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి
- స్పైసెస్ పార్కులో జిల్లా కొనుగోలు కేంద్రం

గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు.. పల్నాడులో 48.10 ఎకరాల భూసేకరణ

- 13 గ్రామాల్లో వేర్వేరు సర్వే నంబర్లలో రెండో రైలుమార్గం నిర్మాణం
- కాంపిటెంట్ అథారిటీగా సత్తెనపల్లి ఆర్‌డీవో నియామకం
- ల్యాండ్ ప్లాన్‌లు, గజిట్ నోటిఫికేషన్ జారీ

వివరాలు 4లో

వినూత్నం.. ఆదర్శం.!

6



తాము పండించిన దేశవాళీ వరి విత్తన కంకులు చూపుతున్న అత్తోట రైతులు

ఇక్కడ కాదంటే అక్కడకు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల తర్వాత గురజాల నియోజకవర్గంలో కొందరు హోంగార్డులను మార్చాలని ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. పిడుగురాళ్లలో పనిచేసిన ఒకరిద్దరు హోంగార్డులు, పోలీసు కానిస్టేబుల్‌పై పలు ఆరోపణలు రావడంతో నరసరావుపేటకు మార్చారు. కానీ, మళ్లీ మాచవరం, దాచేపల్లి మండలాల్లో వారు పోస్టింగ్ ఆర్డర్లు తెచ్చుకున్నారు. పిడుగురాళ్లలో ఆరోపణలతో బయటకు వెళ్లి న కొందరు సిబ్బంది మాచవరం మండలా నికి బదిలీ కావడంతో నేతలు ఆశ్చ ర్యానికి గురయ్యారు. గతంలో వారి నిర్వాకాల వల్ల నియోజకవర్గంలోనే ఉంటే.. మరింత చెడ్డపేరు వస్తుందని, మరో నియోజక వర్గానికి బదిలీ చేయాలని ముఖ్య నేతలు చెప్పినప్పటికీ గుట్టుగా పక్క మండలంలోనే తిష్ట వేశారు. అక్కడ ఇక్కడ ఏం జరుగుతుందనేది తెలుసు కోవడం.. వైసీపీ ముఖ్యులకు సమాచారం చేరవేసే పనిలో ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఆయా శాఖల్లో కోవర్టు లను గుర్తించి మరో ప్రాంతానికి బదిలీ చేస్తే తప్ప.. ఇక్క డికక్కడే తిరుగుతూ ఉంటే చీమ చిటుక్కుమన్నా అవతలి వారికి సమాచారం చేరిపోతుంటే ఎలా పనిచేయాలో అర్థం కాక కొన్ని శాఖల అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది!

- అధికారుల్లో కోవర్టుల భయం
- క్షణాల్లో ప్రతిపక్ష నేతలకు సమాచారం
- కొందరు సిబ్బంది నిర్వాకంతో తిప్పలు
- మా వల్ల కాదంటూ తలలు పట్టుకుంటున్న వైనం



పిడుగురాళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పల్నాడు ప్రాంతంలో పనిచేస్తున్న కొందరు అధికారులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పోలీసు, రెవెన్యూ మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయ పరిధిలో పనిచేసిన కొందరు సిబ్బంది కూటమి ప్రభుత్వ హయాంలోనూ మాజీలకే జీహుజూర్ అంటున్నారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలోనూ కొందరు(ఎస్‌ఐ స్థాయి నుంచి హోంగార్డు వరకు) కోవర్టులుగా పనిచేస్తున్నారు. ఇటీవల వెల్దుర్తిలో జరిగిన జంట హత్యల కేసుల విచారణలోనూ స్టేషన్‌లో ఏమి జరుగుతుందో అవతలి వారికి(వైసీపీ నేతలకు) క్షణాల్లో చేరవేశారు. నిందితులపై ఏఏ సెక్షన్లు నమోదు చేస్తున్నారో తెలుసుకుని, మధ్యవర్తులు, న్యాయవాదుల ద్వారా సెక్షన్లు తగ్గించి కేసు నమోదు చేసేలా చూడాలని పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. తమ వర్గీయుల ఒంటిపై దెబ్బ పడినా ఊరుకునేది లేదంటూ బెదిరించినట్లు చర్చనడుస్తోంది.

విచారణ విషయాలు బయటకు..

జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచి విభాగంలో పనిచేస్తున్న ఓ ఎస్‌ఐని ఇటువంటి ఆరోపణలపైనే వీఆర్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. వెల్దుర్తి జంట హత్యల కేసులో కొందరు అనుమానితులను పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు తీసు కొచ్చిన సందర్భంలోనూ కొందరు కానిస్టేబుళ్లు, హోంగార్డుల ద్వారా విషయం అవతలివారికి చేరిందన్న అధికారులకు తెలిసింది. విచారణ సందర్భంలో ఫొటోలు కూడా అవతలి వారికి వెళ్లాయని అనుమానిస్తున్నారు. దీంతో నిందితుల నుంచి పూర్తి సమాచారం రాబట్టలేకపోతున్నామని అధికారులు మదన పడుతున్నారు. మరో వైపు ఉన్నతా ధికారుల నుంచి మాటలు పడాల్సి వస్తోందని ఒత్తిడికి గురవుతున్నారు.

స్వామి భక్తిని చాటుకుంటున్న సిబ్బంది

వైసీపీ హయాంలో ఆయా కార్యాలయాల్లో తిష్టవేసిన అధికారులు, సిబ్బంది ఆ పార్టీ నేతల రుణం తీర్చుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికీ వారు స్వామి భక్తిని చాటుకుంటున్నారు. నిందితులను, అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన గంటలోపే అవతలి వర్గం నుంచి హెచ్చరికలు చేసేలా ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా ఆన్‌లైన్ చేసుకున్న అప్పటి అధికార పార్టీ నేతలు.. వాటి వివరాలు బయటకు రాకుండా.. ప్రస్తుత సిబ్బందితో మాట్లాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవు తున్నా.. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూము ల ఆక్రమణలు, రెవెన్యూ రికార్డులో మార్పులు చేర్పులు చేసిన వారిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోవర్టులుగా పని చేస్తున్న అధికారులకు భయమనేది లేకుండా పోయింది.

ఈనాం భూ సమస్యలను పరిష్కరిస్తాం: జేసీ



రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న జేసీ

రొంపిచర్ల, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఈనాం భూముల సమస్యలను పరిష్కరి స్తామని జాయింట్ కలెక్టర్ సూరజ్ గురువారం తెలిపారు. రొంపిచర్ల తహసీల్దార్ కార్యా లయానికి గురువారం విచ్చేసిన ఆయన భూ రీ-సర్వే వివరాలను తహసీల్దార్ బండి నిర్మలను అడిగి తెలుసుకున్నారు. ఈనాం భూములను పట్టా మార్చటానికి వివరాలు సేకరిస్తాని చెప్పారు. వారం రోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే విప్పర్లపల్లి అగ్రహారం భూ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని జేసీ తెలిపారు. జిల్లాలోని 11 గ్రామాల్లో ఈ సమస్య ఉందని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ నగదు జమ కోసం భూముల సమస్యను త్వరిత గతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, వీఆర్వో యువరాజ్ ఉన్నారు.

37 ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 37 ఆశ కార్యకర్తల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను శుక్రవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఖాళీగా ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. గ్రామీణ/పట్టణ ఆరోగ్య పారిశుధ్య పౌష్టికాహార కమిటీ ద్వారా అందిన దరఖాస్తుల నుంచి ప్రతిభ కలిగిన అప్లికేషన్లు జిల్లా కార్యాలాయనికి పంపి, డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేపట్టడం జరుగుతుందని డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు.

'గోల్కొండ' టైమింగ్‌లో స్వల్ప మార్పు

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): (17202) సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికలో రైల్వే శాఖ స్వల్ప మార్పులు చేసింది. ఈ నెల 23 నుంచి ఈ రైలు విజయవాడకు రాత్రి 7.20 గంటలకు వచ్చి 7.30కి బయలుదేరుతుంది. ఈ కారణంగా కృష్ణా కెనాల్‌కు రాత్రి 7.38 గంటలకు వచ్చి 7.40కి బయలుదేరుతుంది. ఇతర రైల్వే స్టేషన్ల కాలమాన పట్టికలో ఎలాంటి మార్పులు ఉండవని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

● మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి ● స్పైసెస్ పార్కులో జిల్లా కొనుగోలు కేంద్రం

యడ్లపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ఉమ్మడి గుంటూరు డీఎం నరసింహారెడ్డి తెలిపారు. యడ్లపాడు మండలంలోని స్పైసెస్ పార్కులో ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన గిడ్డంగులను ఆయన గురువారం సందర్శించారు. మార్క్‌ఫెడ్, వ్యవసాయ, గిడ్డంగుల శాఖ అధికారులతో పొగాకు కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పైసెస్ పార్కులోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన గోడౌన్లలో జిల్లా స్థాయి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తగిన వసతులు ఇక్కడ ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల పొగాకును నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పొగాకులో తేమ 20శాతానికి మించకూడదని, బేల్ బరువు 25 నుంచి 150 కేజీల లోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. రవాణా ఖర్చులు రైతులే భరించుకోవాలని, నాణ్యమైన పొగాకు ధర కేజీ రూ.120, తక్కువ నాణ్యత కలిగిన పొగాకు ధర రూ.60 నిర్ణయించినట్లు చెప్పారు. పొగాకును తప్పని సరిగా గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలని స్పష్టం చేశారు. గ్రేడింగ్ చేయకుండా తీసుకువస్తే తక్కువ ధర వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. చవుడు భూముల్లో పండించిన పొగాకులో నికోటిన్ లేనందున కొనుగోలు చేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి బి.మురళీకిషోర్, జిల్లా వ్యవసాయాధికారి మురళి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి

సద్వినియోగం చేసుకోండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బోయపాలెం స్పైసెస్ పార్క్ ఆవరణలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఈ కేంద్రాన్ని ప్రారంబిస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీరు మార్చుకోకపోతే ప్రజలే తరిమి కొడతారు

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి ఆంజనేయులు

వినుకొండ, జూన్-19, (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి, వైసీపీ తీరు మారకపోతే ప్రజలే వారిని తరిమికొట్టే రోజులు త్వరలోనే వస్తాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా భీమిలీ నియోజకవర్గంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాలు మతాలు మధ్య చిచ్చుపెట్టి అధికారం దక్కించుకోవాలనే చూసే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు. రప్పా, రప్పా నరుకుళ్లు.. తప్పుడు కేసులు.. దౌర్జన్యాలు, దుర్మార్గాలు చేసినందునే 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం అయ్యారనే విషయాన్ని గమనించాలన్నారు. ప్రజాస్వామ్య చట్టాలను గౌరవిస్తున్నామని, జగన్‌లా ఇళ్లకు తాళాలు వేసి బంధించడం లేదన్నారు. జగన్ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది కాబట్టే పల్నాడు జిల్లా ఆత్మకూరులో దళితులను గ్రామం నుంచి తరమేసి, పరామర్శించడానికి వెళ్లకుండా చంద్రబాబును అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎప్పుడూ లేనిది కమ్మ సామాజికవర్గంపై కపట ప్రేమ చూపిస్తున్న జగన్.. అధికారంలో ఉన్నప్పుడు రెండవసారి మంత్రి వర్గం విస్తరణలో ఆ వర్గానికి ఒక మంత్రి పదవి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



తనిఖీ చేస్తున్న సమన్వయకర్త సుబ్బారావు

పెదకాకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం ఏడు, ఎనిమిదవ సెమిస్టర్ల (రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు గుంటూరు జిల్లాలో 16, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఏడవ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతున్నాయి. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరీక్ష కేంద్రాల్లో పరిశీలకుల నియామకంతో పాటు తనిఖీ బృందాలను నియమించారు. ఈ తనిఖీ బృందాలు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు కేంద్రాలను తనిఖీ చేపట్టాయి. ఆచార్య ఎం.సుబ్బారావు క్యాంపస్ కళాశాల పరీక్ష కేంద్రంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో చివరి బ్యాచ్ ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు.

ఇద్దరి మృతికి బాధ్యులెవరు జగన్

టీడీపీ పల్నాడు అధ్యక్షుడు కొమ్మాలపాటి

సత్తెనపల్లి జూన్ 19(ఆంధ్రజ్యోతి): జగన్ బలప్రదర్శనలో ఇద్దరి మృతికి బాధ్యులెవరని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బలప్రదర్శన చేసి ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. ప్రజా సమస్యలు ఉంటే పోరాటాలు చేయాలే కానీ, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని హితవు పలికారు. చనిపోయిన ఇద్దరి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించలేదన్నారు. రెంటపాళ్ళలో కూడా వైసీపీ నేత నాగమల్లేశ్వరరావు చనిపోయి ఏడాది తరువాత పరామర్శించడం స్వార్థం కోసం కాదా అని ఆయన ప్రశ్నించారు. అదికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్ దాటిరాని జగన్‌కు ప్రజలు ఇప్పుడు గుర్తొచ్చారని విమర్శించారు. టీడీపీ జిల్లా అదికార ప్రతినిధి కంబాల వెంకటేశ్వరరావు కూడా జగన్ చర్యలను ఖండించారు.

బర్లీ సంబరం

(3వ పేజీ తరువాయి)

చేపట్టవద్దన్నారు. తొలిదశలో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిందని, వీటిని 15 వరకు పెంచే ఆలోచన ఉందన్నారు. స్లాట్ ప్రకారం పొగాకును కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులు తమ దగ్గర నిల్వలు లేవు అని చెప్పేవరకు కూడా కేంద్రాలు తెరిచే ఉంచాలన్నారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్లపై అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్నారు. పదిశా తం మంది పొగాకు రైతులు సాగు వివరాలను నమోదు చేసుకోలేదని అలాంటి వారివిషయంలో ఉదారంగా వ్యవహరించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్‌ను కోరగా ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందించారు.

తొలి రోజు 101 క్వింటాళ్లు..

పర్చూరు యార్డులో బర్లీ పొగాకు కేంద్రం ప్రారంభించిన తొలి రోజు గురువారం 101 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. దాదాపు 12 లక్షల విలువైన కొనుగోళ్లు సాగాయి. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలాని, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, వేర్‌హౌసింగ్ డైరెక్టర్ సురేష్, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు కొండయ్య, బీఎన్ విజయ్‌కుమార్, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

23న సుపరిపాలన - స్వర్ణాంధ్ర



సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ, సీఆర్డీఏ కమిషనర్

తుళ్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 23న వెలగపూడి రాష్ట్ర సచివాలం సమీపంలో నిర్వహించనున్నారు. గురువారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు గురువారం ఏర్పాట్లపై పరిశీలన చేశారు. పగడ్బందీగా పనులు పూర్తి చేయాలని అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ నెల 12న కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా అహ్మదాబాద్ విమాన ప్రమాదం చోటుచేసుకోవడంతో వాయిదా పడింది. జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ నవీన్‌కుమార్, ఆర్డీఏఓ శ్రీనివాసరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని జిల్లాల కలెక్టర్లు, చీఫ్, ప్రిన్సిపల్ సెక్రటరీలు, శాఖల కమిషనర్లు పాల్గొననున్నారు.

బాధిత రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

● జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



బాధిత రైతు కుటుంబంతో మాట్లాడుతున్న గాదె

గుంటూరు మెడికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన మిరప, పత్తి రైతుల కుటుంబాలను జనసేన పార్టీ జిల్లా అధ్యకుడు గాదె వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల గ్రామానికి చెందిన నాశం ఆదినారాయణ, తూబాడు గ్రామానికి చెదిన సిరిబోయిన గోపాలరావు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్థానిక జనసేన నాయకులతో కలసి ఆయా గ్రామాలకు వెళ్లి కుటుంబాలను కలసి, పరామర్శించి తమ సానుభూతిని గాదె వ్యక్తం చేశారు. మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. జనసేన జిల్లా సమన్వయకర్త తోట రాజ రమేష్, నాదెండ్ల ఉపాధ్యక్షుడు శరత్, సుభాని తదితరులు ఉన్నారు.

మన్నవకు సీఎం అభినందనలు!



సీఎం చంద్రబాబుతో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి.. సంస్థని అభివృద్ధి పథంలో నడవడానికి కృషి చేస్తున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మోహన కృష్ణ సీఎంను కలిసి ఏపీటీఎస్‌లో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలను వివరించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నూతనంగా 26 కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఐటీ మేనేజర్ల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, సైబర్ సెక్యూరిటీ సేవలను మరింత విస్తృత పరుస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీ టీఎస్ సంస్థ అనేది ఒకటి ఉందని కూడా ప్రజలకి తెలియలేదని, అలాంటిది సీఎం ప్రోత్సాహంతో ఈ సంస్థ ప్రభుత్వానికి, ప్రజలకి వేవంతమైన సేవలు అందించేలా పని చేస్తోందని మన్నవ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

43,494 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,660 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,494 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,856 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11300
334	9500	13400	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9800	13300
273	10000	12400	నెంబరు. 5	10000	13300
341	10000	13500	273	----	----
4884	---	---	341	10000	13500
సూపర్ 10	---	---	సూపర్ 10	-----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14200
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13300
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

కాకినాడ టౌన్, చర్లపల్లి, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ టౌన్, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07447) కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. (07448) చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 6 నుంచి మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. (07445) కాకినాడ టౌన్ - లింగంపల్లి ప్రత్యేక రైలు జూలై 2 నుంచి మార్చి 30 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.50కి లింగంపల్లి చేరుకొంటుంది. (07446) లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 3 నుంచి మార్చి 31 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 6.30కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.

48.10 ఎకరాలు.. పల్నాడులో భూసేకరణ

● గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు
● 13 గ్రామాల్లో వేర్వేరు సర్వే నంబర్లలో రెండో రైలు మార్గం
● కాంపిటెంట్ అథారిటీగా సత్తెనపల్లి ఆర్డీఓ
● ల్యాండ్ ప్లాన్‌లు, గజిట్ నోటిఫికేషన్ జారీ

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీ నగర్ రెండో రైలు మార్గం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. ఇప్పటికే తెలంగాణలో కొన్ని సెక్షన్లలో భూమి అందుబాటులో ఉండటంతో నిర్మాణ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. మరోవైపు గుంటూరు జిల్లాలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి గతేడాదే భూ సేకరణ నోటిఫికేషన్లను రెవెన్యూ శాఖ జారీ చేసింది. ఇప్పుడు పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం వరకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే గజిట్ నోటిఫికేషన్‌ని కూడా విడుదల చేసింది. భూములు కోల్పోయే యజమానుల అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ భూ సేకరణ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కాంపిటెంట్ అథారిటీ సత్తెనపల్లి ఆర్డీవోని 30 రోజుల వ్యవధిలో సంప్రదించాలని సూచించింది.

భూ సేకరణ ఇలా..

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని 13 గ్రామాల్లో గుంటూరు - బీబీ నగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం 48.10 ఎకరాల భూమిని ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్స్ ప్రకారం సేకరించాల్సి ఉంది. గుడిపూడిలో 0.05, బీమవరంలో 0.390, సత్తెనపల్లిలో 3.28, ధూళిపాళ్లలో 8.10, కంకణాలపల్లిలో 2.065, రాజుపాలెంలో 1.51, రెడ్డిగూడెంలో 11.49, కుబాద్‌పురంలో 4.64, చౌటుపాపాయపాలెంలో 2.74, పెదకూరపాడులో 9.44, లింగంగుంట్లలో 3.82, చినమక్కెనలో 0.28, నాగిరెడ్డిపాలెంలో 0.99 ఎకరాలను వివిధ సర్వే నంబర్లలో సేకరించేందుకు భూ సేకరణ నోటిఫికేషన్‌ని ఇప్పటికే రైల్వే శాఖ విడుదల చేసింది. కాగా, ఇదివరకే గురజాల ఆర్డీఓ కార్యాలయం పరిధిలోని గ్రామాలకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై పూర్తి కావొస్తోంది. గుంటూరు ఆర్డీఓ పరిధిలోనూ దాదాపుగా తుది దశకు చేసుకుంది.

గేమ్ చేంజర్.. డబ్లింగ్ ప్రాజెక్టు

రైల్వేకు ఆదాయం తీసుకురావడం, ప్రయాణికులకు దేశంలోని వివిధ ప్రాంతాలకు రైల్ కనెక్టివిటీ పొందడం, అమరావతి రాజధానికి వివిధ ప్రాంతాల నుంచి రైళ్ల రాకపోకలు సాగించేందుకు గుంటూరు - బీబీ నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు ఒక గేమ్ చేంజర్‌గా మారనుందన్న అభిప్రాయం రైల్వే వర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో నల్లపాడు నుంచి పగడిపల్లి వరకు సింగిల్ లేన్ మార్గం మాత్రమే అందుబాటులో ఉంది. దీని వల్ల రైళ్ల రాకపోకలకు క్రాసింగ్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రయాణ సమయం ఎక్కువగా ఉంటోంది. అదే డబ్లింగ్ పూర్తి అయితే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. దాంతో పాటే కొత్త రైళ్లను ఈ మార్గంలో ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం కూడా గుంటూరు - బీబీ నగర్ డబ్లింగ్‌కు న్యూ పిడుగురాళ్ల వద్ద జంక్షన్ ఏర్పడనుంది.


ఆదర్శమూర్తి
శ్రీమతి నారా భువనేశ్వరి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
రాజమహేంద్రవరంలో జరిగిన సత్యమేవ జయతే దీక్షలో భువనేశ్వరి గారు
రాజమహేంద్రవరంలో అమరావతి రైతులతో భువనేశ్వరి గారు
చంద్రబాబు గారి అరెస్ట్‌తో గుండెపోటుతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి భరోసానిస్తున్న భువనేశ్వరి గారు
జగ్గంపేటలో జరిగిన నిరసన దీక్షలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి గారు
కాంతితో క్రాంతి నిరసనలో ఢిల్లీలో పాల్గొన్న భువనేశ్వరి గారు
తిరుపతిలో జరిగిన నిజం గెలవాలి సభలో మాట్లాడుతున్న భువనేశ్వరి గారు
తెలుగు వారికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నట సార్వభౌమ
డాక్టర్ ఎన్.టి.ఆర్. గారి కుమార్తెగా, ఐ.టీకి కొత్త హంగులు అద్ది లక్షలాది కుటుంబాల్లో
వెలుగులు నింపే ఆదర్శనేత శ్రీ చంద్రబాబు నాయుడు గారి అర్ధాంగిగా,
మంత్రిగా ఏ శాఖ చేపట్టినా ఆ శాఖకు కొత్త వన్నె తీసుకువచ్చే
నేటి యువతరానికి ఐ కాన్ లోకేష్ బాబు గారి తల్లిగా,
యావత్ ఆంధ్రులు అమ్మ అని అభిమానంగా పిలుచుకునే మానవతామూర్తి
నారా భువనేశ్వరి గారికి ఇవే మా జన్మదిన శుభాకాంక్షలు.
గత పాలకుల పుణ్యామా అని రాష్ట్రంలో అలముకున్న అక్రమ కేసుల చీకటి రోజుల్లో
నిజం గెలవాలి అంటూ ఆంధ్రప్రదేశ్‌లోని ఊరు.. వాడా పర్యటించి దగా పడిన గుండెల్లో
భువనమ్మ నింపిన ధైర్య, సాహసాలు అనిర్వచనీయం. అటువంటి స్ఫూర్తి వంతురాలు
నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని ఆకాంక్షిస్తూ...
కందుల శ్రీనివాసరావు- మాధవి
ENTREPRENEUR, గురజాల నియోజకవర్గం - పిడుగురాళ్ళ
లైఫ్ టైం టిడిపి సభ్యులు
కుమార్తె : ప్రజ్ఞశ్రీచౌదరి కుమారుడు : జస్వంత్‌శ్రీ చౌదరి

వినూత్నం..ఆదర్శం.!

ఎప్పుడూ పండించే పంటలే సాగు చేస్తే ఏమొస్తుంది! అవే ఖర్చులు, చాలీచాలని ఆదాయం. అదే కొత్త పంటలు, సరికొత్త సాగు పద్ధతులతో వ్యవసాయం చేస్తే?... వ్యవసాయానికి వ్యవసాయం.. ఆదాయానికి ఆదాయం. ఇదే బాటలో పయనిస్తున్నారు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొందరు రైతులు. పురుగు మందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలు ఆరోగ్యంతోపాటు, మంచి లాభాలు పొందొచ్చని నిరూపిస్తున్నారు. కొంతమంది మన ప్రాంతాల్లో పండవని, సాగు లాభదాయకం కాదని నిన్నటి వరకు వెనకడుగు వేసిన పరిస్థితుల్లో ధైర్యం చేసి డ్రాగన్ ఫ్రూట్, హైబ్రీడ్ నేరేడు వంటి సరికొత్త పంటలను పండిస్తున్నారు. మరికొందరు ఆధునిక వంగడాలు కాకుండా మన పూర్వీకులు పండించిన, అంతరించిపోతున్న వంగడాలను ప్రకృతి సిద్ధంగా పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వాటిని కాపాడుకునేందుకు కొందరు రైతులు కలిసి ఏకంగా విత్తన బ్యాంక్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


దేశవాళీ విత్తన సాగు

తెనాలి: గ్రాఫిక్ డిజైనింగ్‌లో పీజీ చేశాడు. రూ.లక్షలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు. తనకు తోడు మరికొందరు రైతుల్లో చైతన్యం నింపాడు. అందరితో కలసి ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టాడు అత్తోటకు చెందిన ఎర్రు బాపారావు(బాపన్న) అనే యువ రైతు. అందులోనూ రసాయనిక అవశేషాలు లేని ఆహారాన్ని జనానికి అందించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నారు వారంతా. హైబ్రీడ్ వంగడాల వరిలోనూ లోటుపాట్లు ఉన్నాయని భావించి పూర్వీకులు పండించిన దేశీయ వరి వంగడాలపై దృష్టి పెట్టారు. ఈ వంగడాలు అందుబాటులో లేకపోయినా, 'మన ఊరు .... మన విత్తనం' అనే నినాదంతో అతి కష్టం మీద వంద రకాల వరి విత్తన రకాలను సేకరించారు. ఆ విత్తనాలను తమ తోటి రైతులకు అందించారు. వాటి ద్వారా దేశవాళీ వరి వంగడాలను పండించి, దేశీయ విత్తనాన్ని అభివృద్ధి చేసి.. విత్తన నిధిని ఏర్పాటు చేశారు. నల్ల ధాన్యం, చింతలూరు సన్నం, సముద్ర లహరి, సిద్ధ సన్నం, తులసీబాసో వంటి 52 రకాల వరి వంగడాలను పరిరక్షించే దిశగా సాగు చేపట్టారు. ఇప్పటికే వారు పండించిన పంట నుంచి విత్తనాలను ఇతర ప్రాంతాల రైతులకోసం ఉచితంగా అందించి సాగు విస్తీర్ణం పెంపునకు శ్రీకారం చుట్టారు. అత్తోటకు చెందిన ఈ రైతులు తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



నల్లధాన్యం

పై పొట్టు, బియ్యం కూడా నల్లగా ఉంటడం ఈ పంట విశిష్టత. 120 రోజుల ఈ పంట ఎకరాకు 25 బస్తాలు దిగుబడినిస్తోంది. మధుమేహం ఉన్నవారికి ఈ ధాన్యం మంచిదని నానుడి.



సముద్ర లహరి

130 రోజుల కాల వ్యవధి. ఉప్పు నేలల్లో సైతం పండటం విశేషం. ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. ఆరోగ్యం, ఆదాయం మెండుగా ఉంటుంది.



చింతలూరు సన్నం

ధాన్యం ఎర్రగా ఉండి, బీపీటీ తరహాలో ఉంటుంది. 120 రోజుల పంట. ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. సన్నగా, తెల్లగా ఉండే ఈ బియ్యం ఆరోగ్యానికి మంచిదని చెబుతారు.



దేశవాళీ వరి విత్తన కంకులతో అత్తోట రైతులు



రేగిపండ్ల పంట



తోటవద్ద పండ్లు అమ్ముతున్న రైతు

తీరంలో రేగిపంట.. భలే గిరాకీ

రేపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో రేపల్లెకు చెందిన రైతు సురేష్ నగరం మండలం మంత్రి పాలెం సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో ఎవరూ సాగు చేయని రేగి పంట పండిస్తున్నాడు. ఎకరాకు రూ.లక్షపైనే పెట్టుబడి పెట్టి మొక్కలు పెట్టాడు. మూడేళ్లకు పంట కాపుకొచ్చింది. గతేడాది చెట్టుకు 200నుంచి 300కాయలు వరకు కాచాయి. కిలో రూ.50 చొప్పున అమ్మకాలు జరిపారు. ఒక్కసారి పెట్టుబడి పెడితే ఏటా చెట్లను సరిపడా నీరు పెట్టుకుని బతికించుకోవడం, తెగుళ్ల నివారణకు మందులు వాడుకుంటే సరిపోతుంది. 20 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. అయితే మార్కెటింగ్ చేసేందుకు అనువైన ప్రాంతం లేకపోవడంతో కొంతమేర ఇబ్బంది ఉంది. మార్కెటింగ్ అవకాశం ఉంటే అధిక లాభాలు సంపాదించవచ్చని రైతు సురేష్ తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో ఆదాయం

దుగ్గిరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో ఎకరం విస్తీర్ణంలో రైతు యార్లగడ్డ చలమయ్య డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం నరసరావుపేట సమీపంలోని సాతులూరులో మొక్కలను తెచ్చి వేశానని 40 సెంట్లలో వేశానని, లాభసాటిగా ఉండటంతో ఈ ఏడాది మరో 60 సెంట్లలోనూ సాగుచేస్తున్నానని చెప్పారు. ఏడాదికే కాయ కోతకు వస్తుందని, ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే కాపు ఉంటుందని రైతు చెబుతున్నారు. గతేడాది రూ.లక్షన్నర వరకూ ఆదాయం వచ్చిందని, కిలో రూ.80 నుంచి రూ.300 ఈ ఫలం వరకూ ధర పలుకుతోందని చెప్పారు. ఎకరాకు 2వేల మొక్కలు వరకూ వేసుకోవచ్చునని, ఒక్కోమొక్క రూ.35కు కొనుగోలు చేశానని చెప్పారు. పశువుల ఎరువు, వేపనూనె మాత్రమే ఇప్పటి వరకూ వినియోగిస్తూ వచ్చానని.. రూ.5లక్షల వరకూ ఎకరాకు ఖర్చవుతోందని రైతు చలమయ్య తెలిపారు. 15 ఏళ్ల పాటు పంట చేతికి వస్తుందని వివరించారు. ఒక మొక్క దెబ్బతింటే దాని స్థానంలో మరోమొక్క తెచ్చి పెట్టుకోవచ్చునని చెప్పారు. మన నేలకు సరిపోదేమోనని కొందరు రైతులు తనను భయపెట్టారని, ధైర్యంచేసి సాగుచేసినందుకు లాభసాటిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.





డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయితో లాభాలు

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు రైతులు ఉద్యావన పంటలు వైపు మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు వేసి నష్టపోయి.. పండ్ల తోటలతో లాభాల బాట పడుతున్నారు. మాచర్ల నియోజకవర్గంలో డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, దానిమ్మ పంటలు సాగు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్స్‌ను వెల్దుర్తి మండలం ఉప్పలపాడులో 2, గుండ్లపాడు 7, మాచర్లలోని జమ్మలమడకలో 7, రాయవరంలో 3, రెంటచింతల మండలంలో 7 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ ఏడాది అధికంగా బొప్పాయి వందెకరాల్లో సాగు చేస్తున్నారు.

పురుగు మందులు లేని ఆహారం లక్ష్యం

పిడుగురాళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుల అవశేషాలు లేని ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని మాచవరం మండలం కొత్త గణేశుని పాడుకు చెందిన ఆదర్శ రైతు పొందూరి నరసింహారావు, దాచేపల్లి మండలం నడికూడికి చెందిన కోగంటి శివన్నారాయణ చెబుతున్నారు. కొత్తగణేశునిపాడులోని ఐదెకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి, అరటి తోటలు, చేపలు, కోళ్ల పెంపకం, బ్లాక్ రైస్‌ను పండించడమే కాకుండా.. పొరుగు రాష్ట్రాలకూ సరఫరా చేస్తూ.. పలుమార్లు ఆదర్శ రైతుగా గుర్తింపు పొందారు. నాలుగేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు సాగు చేస్తూ రైతులకు అందిస్తున్నాడు. నడికూడిలో కోగంటి శివన్నారాయణ మామిడి, నిమ్మ, జామ, సపోట, వాటర్ యాపిల్‌ను వేప గింజల కషాయం, గోమూత్రం ఎరువుతో పంటలను పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



నరసింహారావు



శివన్నారాయణ

క్వారీ భూముల్లో వడ్డెర్లకు..
సముచిత స్థానంపై హర్షం


గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): క్వారీ భూముల్లో వడ్డెర్లకు సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు, హౌసింగ్ బోర్డు కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో వడ్డెర్లకు ఇచ్చిన హామీని అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో కుల వృత్తుల వడ్డెర్లు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. బీసీ బలహీన వర్గాలను అన్ని విధాలుగా వైసీపీ అణచివేసిందని విమర్శించారు. ఏడాది పాలనలో వడ్డెర్ల అభ్యున్నతి, సంక్షేమానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే వడ్డెర్ల సంక్షేమానికి రూపొందించిన కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఛైర్మన్ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేకర్, గల్లా మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న మల్లె ఈశ్వరరావు

ప్రముఖ సాహితీవేత్త పులిచెర్ల కన్నుమూత

గుంటూరు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీవేత్త, జేకేసీ కళాశాల పూర్వం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు (78) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. సాంబశివరావుకు భార్య భారతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డాక్టర్ పులిచెర్ల 1969 నుంచి 2004 వరకు జేకేసీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. మహారాణా ప్రతాప్ జీవితాన్ని నవల రూపంలో తెలుగు పాఠకులకు అందించారు. వీరపాండ్య కట్ట బ్రహ్మన జీవితాన్ని వీరి అన్న దివంగత పులిచెర్ల సుబ్బారావు నాటక రూపంలో అందించగా సాంబశివరావు నవలగా మలిచారు. దివంగత మన్నవ గిరిధరరావు ప్రారంభించిన భారతీయ మార్గము మాసపత్రిక నిర్వహణను కొనసాగించారు. పత్రికలో రామాయణాన్ని సరళమైన భాషలో తెలుగు పాఠకులకు అందించారు. అది గ్రంథ రూపంలో ప్రచురితమైంది. జాతీయ సాహిత్య పరిషత్ తాండూరు శాఖ డాక్టర్ ఓగేటి అచ్యుత రామశాస్త్రి జాతీయ సాహిత్య పురస్కారం అందజేసి సాంబశివరావును సత్కరించారు. కొన్నాళ్లు విజయవాడలో సమాలోచన నిర్వహించిన కథా రచయితల సమ్మేళనం సార్వజనిక సభకు సాంబశివరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. భద్రాచలంలో జాగృతి పత్రిక నిర్వహించిన కథా రచయితల సమ్మేళనంలోనూ వీరి మార్గదర్శనం లభించింది. తుమ్మల సీతారామమూర్తి చౌదరి కళాపీఠం ద్వారా వారి రచనలన్నిటినీ పునర్ముద్రణ చేయించారు. ఇలా తెలుగు సాహితీ రంగానికి సాంబశివరావు ఎన్నో సేవలందించారు. స్థానిక అరండల్ పేట 17వ లైన్ లోని పులిచెర్ల సాంబశివరావు నివాస గృహంలో ప్రముఖులు ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



డాక్టర్ పులిచర్ల సాంబశివరావు

పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలి

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. సుంకాన్ని 40 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని గురువారం గుంటూరు, చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ కార్యాయలంలో కమిషనర్ టి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రసాదు మాట్లాడుతూ సుంకాన్ని తగ్గిస్తే ఇతర దేశాల నుంచి పెద్ద ఎత్తున పామాయిల్ దిగుమతి జరుగుతుందన్నారు. దీంతో స్థానిక రైతులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు పెట్టుబడి ఇతర ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరగా ప్రకటించాలన్నారు. కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, పామాయిల్ రైతుల సంఘం కార్యదర్శి ఫుల్లారి సోమశేఖరాచార్యులు, వివిధ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేత

కొంగొత్తగా.. సందడి







గుంటూరు జిల్లా పెదకాకాని మండలం గోళ్ళమూడి చెరువు వద్ద కొంగలు సందడి చేశాయి. ప్రకృతి ప్రేమికులను ఇవి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజు భారీ సంఖ్యలో చెరువు వద్దకు కొంగలు వస్తాయి. ఆహారసేకరణ సమయంలో కొంగల విన్యాసాలు, లయబద్ధ విహంగం కనువిందు చేస్తున్నాయి. వీటి కదలికలను, అందాలను వీక్షిస్తూ ప్రజలు.. ఆస్వాదిస్తున్నారు.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

చేనేతకు సహకారం అందించాలి

● ఏడేళ్ల నుంచి లేని సహకార సంఘాల ఎన్నికలు ● ప్రభుత్వం నుంచి రూ.కోట్లలో బకాయిల పెండింగ్
● సంఘాల నుంచి కార్మికులకు అందని సహకారం ● ప్రభుత్వం జీఓ ఇచ్చిన.. అందని విద్యుత్ రాయితీ



ఇసుకపల్లిలోని చేనేత సహకార సంఘ భవనం

రేపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పనగా గుర్తింపు పొందిన చేనేత పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యానికి బలవుతుంది. చేనేత రంగాన్ని పరిరక్షిస్తామంటూ ఎన్నికల సందర్భంగా చేస్తున్న వాగ్దానాలు ఆచరణలో అమలుకు నోచుకోకపోవడంతో మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న చేనేత కార్మికులు ఆకలి కేకలు పెడుతున్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడం లేదు. పవర్ లూమ్ యాజమానులు కేటాయించిన వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికులు మార్కెట్ దెబ్బతినడంతో ఉపాధిని కోల్పోతున్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

ఏడేళ్లుగా చేనేత సహకార సంఘాలకు పాలక వర్గ ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ బోర్డుల ప్రత్యేక అధికారుల పాలన పేరుతో పాలక ప్రభుత్వాలు కాలం గడుపుతున్నాయి. దీంతో సహకార సంఘాలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కార్మికులకు చేతినిండా పని చూపలేకపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 72 సహకార సంఘాలు ఉండగా 11 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారు. చేసిన పనికి మజూరీ సకాలంలో చెల్లించకలేకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని గత పాలక ప్రభుత్వాలకు మొరపెట్టుకున్న ఆలకించిన దాఖలాలు లేవని చేనేత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు.

అమలుకాని ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చేనేత కార్మికులకు నెలకు 200, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తామని వాగ్దానం చేసింది. సంవత్సరం కాలంగా ఇప్పటికి ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోలేదు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి మూడు నెలలు అయ్యినప్పటికి.. కార్మికుల గృహాల్లో విదుత్ వెలుగులు కనిపించడం లేదు.

ఏడేళ్లుగా అందని బకాయిలు

ఏడేళ్లుగా చేనేత సంఘాలకు ప్రభుత్వం నుంచి వివిధ రాయితీల రూపంలో రావాల్సిన రూ.172 కోట్లు బకాయిలు విడుదల కాలేదు. దీంతో సహకార సంఘాలు కార్మికులకు పని చూపించలేని దుస్థితిలో కునారిల్లుతున్నాయి. ఏడేళ్లుగా రాష్ట్రంలో సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన పావలా వడ్డీ వంటి బకాయిలు చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం తోడ్పాటు అందించాలి

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత పరిశ్రమపై జీఎస్టీ విధించడంతో ఆ ప్రభావం పరిశ్రమపై తీవ్రంగా పడింది. నేత కులవృత్తిగా నమ్ముకుని బతుకు సాగిస్తున్న వారిని సంక్షోభంలోకి నెట్టింది.



- జి.బాలాజీ, ఏపీ చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి

సంఘాలకు ఎన్నికలు జరగాలి

చేనేత సహకార సంఘాలకు ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ఎన్నికలు జరిపించాలి. కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాల్సిన పాలక ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది.

- కె.వీరమోహన్‌రావు, చేనేత కార్మికుడు

దాతృత్వం.. పరాధీనం

● ఆరు వందల ఎకరాలకు.. మిగిలింది మూడు వందలే

మూతపడిన అనాథ శరణాలయం



పిల్లుట్లలోనే జీవీజీకేఆర్‌వో హైస్కూల్

పిల్లుట్ల(మాచవరం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని పిల్లుట్ల అనాథ శరణాలయం కొన్నేళ్లుగా మూతపడింది. 1922లో పిల్లుట్ల గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు .. అనాథలు, వితంతువుల సంక్షేమం కోసం వారికి ఉన్న ఆరు వందల ఎకరాల భూములను మిగిలిన స్థిర, చర ఆస్థులను జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌కు ధారాదత్తం చేశారు. ఐతే కొంత మంది దురాలోచనల వల్ల ఆరు వందల ఎకరాల భూమి నేడు మూడు వందల ఎకరాలకు కుచించుకుపోయింది. జీవీజీకేఆర్‌వో హైస్కూల్‌లో విద్యాబుద్ధులు నేర్చుకున్న అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కానీ వినోభావావే భూ ధానోద్యమానికి అంకురార్పణ జరగలేదు. గుర్రం వీరారెడ్డి, పేరమ్మ దంపతులకు కలిగిన నలుగురు సంతానం అకాల మృత్యువు పాలయ్యారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిగిన కొద్ది కాలానికే మృతి చెందారు. దీంతో తల్లడిల్లి పోయిన వీరారెడ్డి కొడుకు కృష్ణారెడ్డి పై ఆశలు పెట్టుకున్నాడు. కాకినాడలోని పీఠాపురం రాజావారి కళాశాలలో చేరిన కృష్ణారెడ్డి.. కందుకూరి వీరేశ లింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గురజాడ అప్పారావు తదితర సంఘ సంస్కర్తల ఆశయాలకు ప్రభావితుడయ్యారు. పిల్లుట్ల గ్రామంలో కూడా సంస్కరణలు ప్రవేశ పెట్టేందుకు కృష్ణారెడ్డి కృషి చేశారు. కానీ, ఆయన తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఈ క్రమంలో కృష్ణారెడ్డి తండ్రి వీరారెడ్డిని పిలిచి చేతిలో చేయి వేయించుకున్నాడు. తనను బతికించుకునేందుకు మీరు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలయ్యాయని, ఈ పాటి వైద్యం కూడా చేయించుకోలేని అభాగ్యులు, అనాథలు సమాజంలో ఎందరో ఉన్నారని గుర్తు చేస్తూ- తమ యావదాస్థిని వారి సంక్షేమం కోసం దానం చేయాలని కోరారు. తండ్రి వీరారెడ్డి, 1922 నవంబరు 22న మృతి చెందిన కుమారుడి చివరి కోరిక తీర్చేందుకు నడుం కట్టారు. జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌ను ఏర్పాటు చేసి స్థిర, చరాస్తులన్నింటినీ దానికి స్వాధీనం చేశారు. ఇందు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కొడుకు చనిపోయిన 32 రోజులకు తండ్రి వీరారెడ్డి కూడా తనువు చాలించాడు. కొంత కాలం తర్వాత జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌ను కమిటీ దేవదాయ శాఖకు అప్పగించింది. దేవదాయ శాఖకు అప్పగించే సమయానికి మూడు వందల ఎకరాలు మాత్రమే మిగిలింది. అందులో కూడా సుమారు 150 ఎకరాలు ప్రస్తుతం బీడు భూములుగా ఉన్నాయి. మిగిలిన 150 ఎకరాలు వేలం పాటల ద్వారా కౌలుకు ఇస్తున్నారు. కేవలం సంవత్సరానికి రూ.7 లక్షలు మాత్రమే కౌలు ద్వారా ఎస్టేట్‌కు ఆదాయం వస్తుంది. అప్పట్లో అనాథ శరణాలయం విరాజిల్లినప్పటికీ నేడు మూత పడి పోయింది. ప్రస్తుతం ఆర్థిక వనరులు లేక మూత పడినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. జీవీజీకేఆర్‌వో హైస్కూల్‌లో పని చేసే ప్రైవేట్ ఉపాధ్యాయులకు కొద్దో గొప్పో జీతాలు ఇస్తున్నారు.



పిల్లుట్లలో ఏర్పాటు చేసిన దాతల విగ్రహాలు

రూ.7 లక్షలు కౌలు వస్తుంది : ఈవో శ్రీనివాసరెడ్డి

పిల్లుట్ల జీవీజీకేఆర్‌వో ఎస్టేట్ కింద ఉన్న భూములకు సంవత్సరానికి రూ.7 లక్షలు మాత్రమే కౌలు వస్తుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నగదుతో ఏటా కృష్ణారెడ్డి, వీరారెడ్డి జ్ఞాపకార్థం జయంతి, వర్ధంతి సభలు జరుపుతామని, వితంతువులకు దుస్తులు పంపిణీ చేస్తామని, స్థానిక సిబ్బందికి జీత భత్యాలు ఇస్తున్నామని వెల్లడించారు.



మూతపడిన అనాథ శరణాలయం గదులు

30 లోగా ఈకేవైసీ పూర్తి చేయాలి

నకరికల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఈకేవైసీ చేయకుండా మిగిలిపోయిన సభ్యులకు ఈనెల 30వ తేదీలోగా ఈకేవైసీ పూర్తిచేయాలని తహసీల్దార్ కే పుల్లారావు డీలర్లను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డులో 65 సంవత్సరాలు పైబడిన వారికి ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ లోపు వారి ఇంటికి వెళ్ళి రేషన్ పంపిణీ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్

పనితీరు వేగవంతం చేయండి

● వీఆర్‌వో, వీఆర్‌ఏల సమావేశంలో తహసీల్దార్

దాచేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ పనితీరుపై ప్రజల్లో సదాభిప్రాయం లేదు.. పనితీరు మెరుగు పరుచుకోండి.. ప్రజలు అర్జీలను తక్షణమే పరిష్కరించండి.. నెలల తరబడి పెండింగ్ పెడితే సహించం అంటూ దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ వీఆర్ఏ, వీఆర్‌వోలను ఆదేశించారు. గురువారం దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్‌వో, వీఆర్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో ఆరోపణలకు, అవినీతికి తావు లేకుండా పని చేయాలని తహసీల్దార్ కోరారు. అనంతరం తహసీల్దార్‌ను వీఆర్‌వో, వీఆర్‌ఏలు సత్కరించారు.

కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి

● కమిషనర్ శ్రీనివాసులు

పిడుగురాళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని గురువారం కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుశిక్షణను మహిళలు ఉపయోగించుకోవడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

రేపు యార్డులో యోగాంధ్ర

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీ ఉదయం పిడుగురాళ్ల మార్కెట్ యార్డు ఆవరణలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, యువకులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంచార జాతుల్లో రక్తహీనతను గుర్తించండి

దాచేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సంచారజాతుల్లో, ప్రధానంగా గిరిజనుల్లో రక్తహీనత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వారిని గుర్తించి వైద్యసేవలందించాలని ప్రభుత్వ వైద్యులు సుచరిత సూచించారు. గురువారం దాచేపల్లి వైద్య ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో యోగా గురించి వైద్య సిబ్బందికి వివరించారు. త్వరలో జరగనున్న యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పిడుగురాళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులో వున్న బ్రహ్మానందరెడ్డి కాలనీలో బీఆర్‌జేసీ పాఠశాలలో కూటమి నేతలు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, ముప్పన వెంకటేశ్వర్లు, వల్లెపు రామకృష్ణ, బిజిలి వెంకటరావు, చింతపల్లి యర్రయ్య, కుంచపు శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బత్తుల రాము, తదితరులు విద్యార్థులకు పుస్తకాలు, విద్యామిత్ర కిట్‌లు అందజేశారు.

మాచవరం ఎస్ఐగా తిరుపతిరావు



మాచవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాచవరం మండల ఎస్ఐగా తిరుపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన రోశయ్యను నరసరావుపేట ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఎస్ఐ తిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేలా కృషి చేస్తానన్నారు.

నివాళులు

ముప్పాళ్ళ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాద ల గ్రామానికి టీడీపీ మాదల క్లస్టర్ ఇన్‌చార్జ్ తెల్లజర్ల వెంకటేశ్వర్లు కుమారుడు మధు(24) బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెం దారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

పిల్లలందరికీ తల్లికి వందనం

క్రోసూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గృహంలో ఎంత మంది పిల్లలందరికీ తల్లుల ఖాతాల్లో రూ.13వేలు చొప్పున నగదు జమయ్యాయని లబ్ధిదారులైన మహిళలు గురువారం వెల్లడించారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన వాసా ధనలక్ష్మి తన ముగ్గురు కుమారులకు రూ.39వేలు, కె.ఆదిలక్ష్మి ముగ్గురు కుమార్తెలకు రూ.39వేలు ఖాతాల్లో జమైనట్టు తెలిపారు. టీడీపీ నాయకులతో కలసి చంద్రబాబు, నరేంద్రమోడీ చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంభా ఏడుకొండలు, ఏపూరి శ్రీనివాసరావు, ఏపూరి గోవిందరావు, కొజ్జా అమరయ్య, పగడాల రాజు, జయరావు పాల్గొన్నారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో హామీల్లో భాగంగా తల్లికి వందనం నేరవేర్చటంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని ఆకులగణపవరం గ్రామానికి చెందిన పల్లపాటి శ్రీలక్ష్మికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వారికి రూ.52వేల నగదు జమకావటంతో శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తోంది.

అణగారిన వర్గాల గొంతుక రాహుల్ గాంధీ

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల గొంతుక రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. 2029లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము కోటేశ్వరరావు, గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, దొడ్డా శ్రీనివాసరావు, గాలం పెద అంజి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అఖిల భారత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చుక్కా చంద్రపాల్, చాంద్ బాషా, మాదంశెట్టి వేదాద్రి, అజీమ్, కొత్త లక్ష్మయ్య, జెట్టి శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా దేచవరం బ్రిడ్జి



శిథిలావస్థకు చేరిన దేచవరం బ్రిడ్జి

నకరికల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోడ్డు నుంచి దేచవరం వెళ్లే రహదారిలో కాల్వపై ఉన్న వంతెన ప్రమాద కరంగా మారింది. ఎన్నో సంవత్సరాల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చు లూడి ఇనుపచువ్వలు బయటపడ్డాయి. చిలకలూరిపేట మేజరుకాలువపై ఉన్న ఈ వంతెన కోతకు గురైంది. నిత్యం ఈ మార్గంలో ప్రైవేట్ పాఠశాలల వాహనాలు, దేచవరం మోడల్ స్కూల్‌కు వెళ్ళే విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. వంతెనకు పిట్టగోడ కూడా లేకపోవడంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని దేచవరం ప్రజలు కోరుతున్నారు.



సైడ్ వాల్స్ కూడా లేని దృశ్యం

సర్వసభ్య సమావేశానికి అధికారుల మందకొడి హాజరు



మాట్లాడుతున్న ఎంపీపీ మీరయ్య

పెదకూరపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు హాజరు కారా? అని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులోని మండల పరిషత్ సమావేశ హాల్‌లో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన 20మందికి పైగా అధికారులు ఉంటే పదిమంది కూడా హాజరు కాకపోవటంతో సమస్యలపై మాట్లాడటం కూడా ఉపయోగం లేదన్నారు. ఇదే పరిస్థితి మరోసారి జరిగితే కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శరత్‌బాబు, ఎంపీటీసీలు, గుడిపూడి రాజు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న భార్యలకు బదులు భర్తలు సమావేశాలకు హాజరవడం విశేషం.

21న మహాచైత్యం వద్ద యోగాంధ్ర



మహాచైత్యం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీన ఉదయం 6గంటల నుండి 8 వరకు అమరావతిలోని మహాచైత్యం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రధాని పాల్గొన్న కార్యక్రమాన్ని లైవ్‌లో చూపించి విద్యార్థులచే యోగాసనాలు చేయించనున్నారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిధిగా పాల్గొంటున్నారు. దీనికి సంబంధించి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి గురువారం మండల స్థాయి అధికారులతో మహాచైత్యం వద్ద సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య ఏర్పాట్లు, విద్యార్థుల సమీకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో టీ పార్వతి, ఎంఈఓ శివబాబు, ఈఓపీఆర్డీ కె.పద్మజ, ఆర్ఐ శిరోమణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

సత్తెనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజీ పడదగిన కేసుల్లో లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు చూడాలని సీనియర్ సివిల్ జడ్జి బీ విజయకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష జరిగింది. సమావేశంలో విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జూలై 5న జరగనున్న లోక్‌అదాలత్‌లో న్యాయస్థానాల పరిధిలో ఉన్న రాజీపడదగిన కేసుల్లో ఎక్కువగా పరిష్కారమయ్యేలా న్యాయవాదుల సహకారం కూడా అవసరమన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కౌషిత్ హుస్సేన్, ప్రియదర్శిని, కే సుజన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బీ విజయకుమార్‌రెడ్డి

గోపిరెడ్డి, భార్గవరెడ్డిలపై కేసు నమోదు

సత్తెనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా బుధవారం పట్టణంలో పోలీసు నిబంధనలను ఉల్లఘించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, మరికొంతమంది వైసీపీ నాయకులు అనుమతులు లేకుండా డీజేతో ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని పట్టణానికి చెందిన ఎన్ నాగమల్లేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. వారిపై 223, 261, 189(3), 189(4) రెడ్‌విత్ బీఎన్ఎస్ సెక్షన్‌ల కింద కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరిపై...

మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా అనుచిత వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించిన ఇరువురు యువకులపై పట్టణానికి చెందిన టీడీపీ నేత షేక్ మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన షేక్ బాజి, క్రోసూరు మండలం 88 తాళ్ళూరుకు చెందిన బొల్లెద్దు రవితేజపై 352, 351(2) రెడ్‌విత్3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రవితేజను అదుపులోకి తీసుకోగా, బాజీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఘన జీవామృతంతో సారవంతంగా భూమి

ముప్పాళ్ళ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రైతులు ఘన జీవామృతం వాడి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ అమలకుమారి అన్నారు. మండలంలోని మాదలలో గోగినేని కోటేశ్వరరావు గోశాలను ఆమె గురువారం సందర్శించారు. ఘన జీవామృతం, కషాయాలు, పంచగవ్య తయారుచేస్తున్న విధానాన్ని కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కషాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు కొనుగోలుచేయవచ్చన్నారు. ఆమె వెంట పలువురు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



మాదలలో గోశాలను సందర్శిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమలకుమారి

అటవీ శాఖ కార్యాలయంలో ద్విచక్ర వాహనాలు చోరీ

మాచర్లటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. కార్యాలయంలో పార్కింగ్ చేసిన ఏపీ07డీఎన్ 7866 పల్సర్, ఏపీ39ఎంవీ 1512 హోండాషైన్ బైకులు ఈనెల 14వ తేదీన చోరీకి గురైనట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆర్ రాజేష్ గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో మేజర్ పనులు పూర్తి చేయాలి

ఇరిగేషన్ ఈఈ టి.రమేష్



దశబంధు మేజర్ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ టి.రమేష్, ఇతర అధికారులు

రెంటచింతల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాల్వల మరమ్మతుల్లో నాణ్యత వుండాలని.. నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేసి అన్నదాతలకు సాగునీటి సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని ఇరిగేషన్ ఈఈ టి.రమేష్ ఆదేశించారు. గురువారం రెంటచింతల మేజర్ దశబంధు కాలువ పనులను పరిశీలించారు. 7.6కి.మీ. నుంచి 15.6 కి.మీ. వరకు చేపడుతున్న పనులకు రూ.36.70 లక్షలు కేటాయించారన్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోట్ల నరసింహారావు, సతీష్, డీఈ టి.మురళీధర్, ఏఈ పిసు ధాకరరావు, సాగునీటి సంఘ సభ్యులున్నారు.

ఖచ్చితమైన హామీ ఇస్తేనే పెగ్ మార్క్‌కు అనుమతిస్తాం

● అధికారులతో కర్లపూడి రైతులు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి నూతనంగా ఏర్పాటుచేయనున్న రైల్వే లైనుకు సంబంధించి భూమి హద్దులను సర్వే చేసేందుకు గురువారం గ్రామంలోకి వెళ్లిన రెవెన్యూ, రైల్వే అధికారులను కర్లపూడి రైతులు అడ్డుకున్నారు. తమ భూములలో పెగ్‌మార్క్ వే సేందుకు వీలులేదని తమకు ప్రభుత్వం నుండి హామీగానీ పూలింగ్‌కు సంబంధించి నోటిఫికేషన్ గానీ ఇస్తేనే తాము అంగీకరిస్తామని రైతులు అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బెల్లంకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు పద్ధతులు మార్చుకోవాలని, రౌడీషీటర్లపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ షణ్ముక్, సిబ్బంది పాల్గొన్నారు.

21న పట్టణంలో యోగా దినోత్సవం

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 20.80 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

బెల్లంకొండలో వైద్య శిబిరం

బెల్లంకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో గురువారం వైద్యశిబిరం నిర్వహించినట్టు ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బెల్లంకొండ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గృహాల పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం 130 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేని మిరప, పత్తి విత్తనాలు సీజ్

అచ్చంపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామంలో శ్రీపుల్లారెడ్డి సీడ్స్ అనే విత్తనదుకాణంలో గురువారం విజిలెన్స్ ఏవో ఆదినారాయణ, ఏవో పీ వెంకటేశ్వర్లు, సీఐ శివాజీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని మిరప, పత్తి విత్తనాలు 15 కేజీల 730 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,67,630 విలువైన విత్తనాలను సీజ్‌చేసి అమ్మకాలను నిలిపివేశారు. మిగిలిన దుకాణాల్లోనూ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

వేల్పూరులో విత్తన షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఏవో ఆదినారాయణ, ఏవో వెంకటేశ్వర్లు



పౌరాణిక కళాకారుడు లక్ష్మారెడ్డి మృతి

పెదకూరపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన పౌరాణిక కళాకారుడు, ప్రజా నాట్య మండలి నాయకుడు సిర్రా లక్ష్మారెడ్డి(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ప్రజానాట్య మండలి కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

బాలికల ఆశ్రమ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులోని బాలికల ఆశ్రమ పాఠశాలకు గురువారం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి రూ.2 వేల విలువైన సౌండ్ సిస్టం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్‌వలి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



దొడ్లేరులో రేషన్ షాపు తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

క్రోసూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని దొడ్లేరులో రేషన్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయనతో పాటు డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకటరావు, వీఆర్‌వో కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఇంద్రాణికి యోగాంధ్ర డ్రాయింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగాదినత్సం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో అమరావతికి చెందిన గుడిపూడి ఇంద్రాణికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. యోగా విశిష్టతను తెలియజేస్తూ గీసిన చిత్రాన్ని ఎంపిక చేసి విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్‌లు బహుమతి అందించారు. 21న వైజాగ్‌లో ప్రధాని మోదీ పాల్గొనే యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని ప్రభుత్వం ఆహ్వానం పంపింది.



ఇంద్రాణి డ్రాయింగ్ వేసిన చిత్రం



ఇంద్రాణి

మేజర్, మైనర్ కాల్వల ఆధునికీకరణకు రూ.217కోట్లు



తంగెడ మేజర్ పరిధిలో మైనర్ కాల్వలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో తంగెడ, ఆకురాజుపల్లె మేజర్ కాల్వల పూడికతీత చేపట్టి దిగువ ప్రాంత భూముల వరకు సాగునీరు అందించడంలో ముందడుగు వేశారు. తంగెడ, ఆకురాజుపల్లె, రామాపురం, దైద, గొట్టిముక్కల మేజర్లు గురజాల నియోజకవర్గ పరిధిలో వున్నాయి. మేజర్లకు అనుసంధానంగా పలు మైనర్ కాల్వల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ కాల్వకట్టల బలోపేతం వంటి పనులు పూర్తిచేసేందుకు రూ.217కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఓఅండ్ఎం వర్క్‌ల కింద ఈ నిధులను 31 భాగాలుగా చేసి సాగునీటి సంఘాల అధ్యక్షులు, అధికారుల ఆధ్వర్యంలో పనులు త్వరితగతిన పూర్తిచేసి ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలయ్యే నాటికి పూర్తయ్యేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు దాచేపల్లి పరిధిలో గురువారమే పనులకు శ్రీకారం చుట్టారు. ఇన్‌చార్జ్ డీఈ ఆదినారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు భాస్కరరావులు కాలువ పనులను పర్యవేక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో మేజర్, మైనర్ కాల్వల ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు కావడం, వాటిని త్వరితగతిన పనులు పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ చూపడంతో ఎగువ, దిగువ భూముల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నకరికల్లు టీడీపీ అధ్యక్షుడిగా ఆకుల

నకరికల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలో టీడీపీ గ్రామ కమిటీలను, అనుబంధ సంఘాల కమిటీలను నియమించినట్టు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య తెలిపారు. నకరికల్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఆకుల పెదవెంకటేశ్వర్లు, మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్షులను నియమించారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నకరికల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ సోలార్ పథకాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని నకరికల్లు ఏఈఈ గౌస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జీవితాంతం ఈ పథకం ద్వారా ఉచితంగా కరెంటును పొందవచ్చన్నారు. ఆదాయం లభిస్తుందన్నారు. అవసరమైన నిధులను బ్యాంక్ రుణం ఇస్తుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నా రు. నకరికల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. వివరాలకు నకరికల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌వోలతో తహసీల్దార్ సమీక్ష

అచ్చంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ ఎస్ సరోజ వీఆర్‌వోలతో సమీక్ష నిర్వహించారు. రేషన్‌కార్డులపై వస్తున్న దరఖాస్తులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. సచివాలయాల్లో వచ్చే దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని, సమయపాలన పాటిస్తూ అందరికీ అందుబాటులో ఉండాలన్నారు.

భయభ్రాంతులకు గురి చేస్తున్న వైసీపీ నాయకులు

పెదకూరపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజలను వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ గురువారం తెలిపారు. వైసీపీ నేతలకు అనుమతులు అక్కర్లేదని, ఆంక్షలను పట్టించుకోరని, ప్రజల ప్రాణాలంటే లెక్క లేదన్నారు. వైసీపీ నేత జగన్ వెళ్ళిన ప్రతిచోట ఇదే అరాచకమన్నారు. అలజడులు సృష్టించి శాంతిభద్రతలు విఫలమయ్యాయని ప్రజలను పక్కదారి పట్టించటానికి జగన్‌రెడ్డి వచ్చారన్నారు.

రెవెన్యూ అధికారులకు ఆటల పోటీలు

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు ఆటల పోటీలు జరిపారు. మహిళా ఉద్యోగులకు కుర్చీలు, షటిల్ పోటీలను నిర్వహించారు. తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ వాణి, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది కెనడి మృతి



కెనడి (ఫైల్‌ఫోటో)

మాచర్ల రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కె.కెనడి గుండెపోటుతో మృతిచెందారు. గుంటూరు, మాచర్ల న్యాయస్థానాలలో న్యాయవాదిగా పనిచేసిన కెనడి గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. మాచర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కెనడి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

రెంటచింతల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఇంటిలో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన తుమ్మకోట గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ నాగార్జున కథనం మేరకు... పేరుపోగు సైదులు(33), సాగరికలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. రెండేళ్ల నుంచి భార్యభర్తలు విడివిడిగా వుంటున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సైదులు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో ఒంటికి నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని 23వ వార్డు యాదవుల బజారుకు చెందిన కాళంగి కుమార్, సుజాతలు భార్యాభర్తలు. కుమార్ పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. కుమారు మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తలకు తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా కుమార్ మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. ఉదయాన్నే కుమార్ రెస్టారెంట్‌కు వెళ్లిన తరువాత సుజాత నిప్పంటించుకుంది. కేకలు పెట్టడంతో స్థానికులు వచ్చి మంటలను ఆర్పారు. 70 శాతం దాకా శరీరం కాలిపోగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేట రిఫర్ చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మృతదేహానికి వారం తరువాత పోస్టుమార్టం

రొంపిచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవాల గ్రామంలో చనిపోయిన వారం తరువాత మృతదేహానికి పోస్టుమార్టం గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన దాసరి సురేష్(20) గ్రామ సమీపంలోని బావి వద్ద మరో ఇద్దరితో కలసి ఆడుకుంటుండగా బంతి బావిలో పడింది. బంతిని తీసే క్రమంలో సురేష్ బావిలో దిగి మృతి చెందాడు. ఐతే సురేష్ తండ్రి వెంకటేశ్వర్లు నరసరావుపేటలో ఎస్పీ వద్ద ఫిర్యాదు చేయటంతో తహసీల్దార్ బండి నిర్మల, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మణికృష్ణ, బంధువులు, తల్లిదండ్రుల సమక్షంలో అలవాల గ్రామంలో మృతదేహానికి ఫోరెన్సిక్ నిపుణులు పోస్టుమార్టం నిర్వహించారు.

రికవరీ ఫోన్లు బాధితులకు అందజేత

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 11 సెల్ ఫోన్‌లను అర్బన్ పోలీసులు రికవరీ చేశారు. పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సంబంధిత వ్యక్తులకు వాటిని పోగొట్టుకున్న బాధితులకు సీఐ రమేష్ అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వెంటనే బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వల్ల వాటిని తిరిగి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

రక్షణ కల్పించాలని పోలీసులకు న్యాయవాది వినతి

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో ఒక న్యాయవాది తనకు, తన కుటుంబానికి శిరీషబాయి అనే మహిళ నుంచి ప్రాణహాని ఉందని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. నరసరావుపేట సెంటర్‌లోని ఒక షాపింగ్ మాల్‌లో స్కూల్ బ్యాగ్స్ కొనేందుకు తన భార్యతో కలిసి వెళ్లిన సందర్భంలో శిరీషబాయి, మరో ఇద్దరు తనపై దాడి చేశారని ఆయన తన వినతిపత్రంలో తెలిపారు.

బీజేపీలో 300మందికి పైగా చేరికలు

వినుకొండ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లో భారతీయ జనతాపార్టీలోకి సుమారు 300మంది చేరారు. బీజేపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. పల్నాడు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడమ్ రమేష్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోస్టల్ జోన్ ఇన్‌చార్జి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుస్తకం పఠనం విద్యార్థులకు ఉపయోగకరం: హెచ్ఎం

నూజెండ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పుస్తకం పఠనం విద్యార్థులకు ఉపయోగకరమని మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు అన్నారు. గురువారం జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా పుస్తకాలు చదివించారు.

నువ్వుల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: హనుమంతరావు

శావల్యాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణ, ప్రకాశం, పల్నాడు, బాపట్ల తదితర జిల్లాల్లో నువ్వులు పంట పండించిన రైతులకు కనీస మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వారిని తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర రైతాంగ పోరాట కమిటీ నేత, టీడీపీ మాజీ రాష్ట్ర పరిశీలకులు ముండ్రు హనుమంతరావు కోరారు. శావల్యాపురంలో గురువారం ఆయన మాట్లాడుతూ 2024-25లో నువ్వులు కనీస మద్దతుధర క్వింటాకు రూ.9267ఉండగా, 2025-26లో కనీస మద్దతుధర రూ.9846గా ప్రభుత్వం ప్రకటించిదని, కానీ బహిరంగ మార్కెట్‌లో దళారులు రూ.7300 నుండి 7800 మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు.

నీట్ ర్యాంకర్ భవిష్యారెడ్డికి మాజీ ఎమ్మెల్యే బొల్లా అభినందనలు

బొల్లాపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదల చేసిన నీట్ 2025 ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 1649వ ర్యాంకు సాధించటంపై పమిడిపాడుకుచెందిన భవిష్యారెడ్డిని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయిలో గొప్ప విజయం సాధించటం మంచి పరిణామమన్నారు.

రెవెన్యూ అంశాలపై తహసీల్దార్ విజయశ్రీ సమీక్ష

యడ్లపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై తహసీల్దార్ విజయశ్రీ గురువారం సమీక్షించారు. కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో రైస్‌కార్డుల జారీ, పీజీఆర్ఎస్, కౌలు కార్డుల జారీ, నీటి తీరువా వసూలు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు గురించి చర్చించారు. అలాగే జాయింట్ ఎల్‌పీ నంబర్ల సబ్ డివిజన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీటీ అనూరాధ, ఆర్ఐ సుబ్బారావు, మండల సర్వేయర్ సురేంద్ర పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో బోరు ఏర్పాటు

యడ్లపాడు, జూన్ 19 (ఆంధ్రజోతి): చిలకలూరిపేటకు చెందిన స్వచ్ఛంద సంస్థ అసిస్ట్, జాలాది నీటి సంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్యల ఆర్థిక సహకారంతో యడ్లపాడు ఎస్టీ కాలనీలో శుక్రవారం బోరు బావి వేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, అసిస్ట్ ప్రతినిధులు కృష్ణహరీష్, టీడీపీ నాయకులు జి.శ్రీనివాసరావు, పి.వెంకటరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ

ఈపూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పలు సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. మండలంలోని పెద కొండాయపాలెంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంట ఆంజనేయులు, శాఖమూరి శ్రీనివాసరావు, హెచ్ఎం షేక్ హసీన్ బీ, ఉపాధ్యాయుడు గద్దె రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లపై సమన్వయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

నరసరావుపేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో 2024-25 సంవత్సరం పండించిన బర్లీ పొగాకు రైతుల నుంచి కొనుగోలుపై గురువారం నరసరావుపేట ఆర్డీవో మధులత ఆధ్వర్యంలో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. గ్రామస్థాయిలో రైతులకు భరోసా కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ 2522మంది రైతులు ఏపీ ఏఎంబిఎస్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. సదరు రైతులందరూ సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లయితే పండించిన పొగాకును ప్రభుత్వం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం టి.నరసింహారెడ్డి మాట్లాడుతూ శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు యడ్లపాడు స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ గోడౌన్లో పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. హెచ్‌వీఎం టాప్ గ్రేడ్ పొగాకు కేజీ 120రూపాయలకు, హెచ్‌డీఎక్స్ గ్రేట్ టొబాకో కేజీ 60 రూపాయలకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పొగాకును గ్రేడ్లుగా చేసుకొని బేల్స్‌గా కట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. బేల్ బరువు 25కేజీల నుంచి 150కేజీలు మాత్రమే ఉండాలన్నారు. తేమ శాతం 20శాతానికి మించి ఉండకూడదు అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు కొనుగోలు తేదీ సమయం వారి మొబైల్ నెంబర్‌కు సమాచారం వస్తుందన్నారు. ఆరోజు మాత్రమే కొనుగోలు కేంద్రానికి వారి పొగాకును తీసుకొని వెళ్లాలని సూచించారు. ఆధార్ లింక్ అయిన బ్యాంక్ నెంబర్‌కు డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎం.శివకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు టి.మస్తానమ్మ, జీడీసీఎంఎస్ మేనేజర్ హరగోపాల్ నర్సరావుపేట సబ్ డివిజన్‌కు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాను రూపుమాపుదాం: కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావు పేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) అరుదైన జన్యుపరమైన వ్యాధి సికిల్‌సెల్ ఎనీమియాను రూపుమాపేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. సికిల్‌సెల్ ఎనీమియా అనే వ్యాధిపై గురువారం నరసరావుపేట మండలం, పెద్ద తురకపాలెం గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహం, పాఠశాలలో జరిగిన ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సులో కలెక్టర్ అరుణ్ బాబు, శాసన సభ్యుడు చదలవాడ అరవింద్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కొద్దిమందికో వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి సోకిన వారిని వెంటనే గుర్తిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వల్ల రక్తంలో ఆక్సిజన్ తక్కువై తెల్ల రక్తకణాల శాతం పడిపోతుందన్నారు. ఈ వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స చేయించటం వల్ల వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చుననన్నారు. గిరిజనుల్లో ఈ వ్యాధి గురించి ఎక్కువ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన తెగలకే ఎక్కువగా సోకుతుందని, వారిలో మేనరికాలు, ఒకేరక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల వ్యాధి సోకుతుందన్నారు. రక్తహీనత, సరిపడ ఆక్సిజన్ అందక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి రవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జ్యోత్స్న, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణంపై ఆర్డీవో పరిశీలన



ఏనుగుపాలెం రైల్వే గేట్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, అధికారులు

వినుకొండ టౌన్, జూన్ 19 (ఆంధ్రజోతి): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని రైల్వేగేట్ వద్ద రైల్వే అండర్ బిడ్జి నిర్మాణంపై పల్నాడు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఉమ్మడి తనిఖీ చేపట్టారు. సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గతంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే పూర్తి స్థాయిలో ప్రణాళికలు ఏర్పాటు చేసినప్పటికీ, రానున్న రోజుల్లో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేలా తనిఖీ నివేదికను తయారు చేయాలని మధులత అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వచ్చే నెల 6వ తేదీన జరిగే శ్రీరామ లింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సంపై అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన పరిణామాలకు భిన్నంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీరు. పారిశుధ్యం, రోడ్డు నిర్మాణ పనులు, కొండపై రాకపోకలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 24 తేదీన మరోసారి ప్రభుత్వ చీఫ్‌విప్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మధులత తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌నాయక్, కమిషనర్ శుభాష్ చంద్రబోస్, ఆర్అండ్‌బీ డీఈఈ, పోలీస్ అధికారుల పాల్గొన్నారు.

పొగాకు రైతులు మార్క్‌ఫెడ్ సూచనలు పాటించాలి: డీడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

నాదెండ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులు మార్క్‌ఫెడ్ సూచనలను పాటించి పొగాకును అమ్ముకోవాలని డీడీఏ శివకుమారి అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల రైతు సేవా కేంద్రంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రైతులకు పలు సూచనల కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రతి రైతు పీఎం యాప్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తేరణాలతో ఎండ బెట్టిన పొగాకును తాళ్లతీసి బేళ్ళు కట్టాలన్నారు. సీఎం యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు మాత్రమే పొగాకును అమ్ముకోవటానికి అర్హులని వివరించారు. సంబంధిత కొనుగోలు కేంద్రానికి మాత్రమే బేళ్ళను తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో శ్రీలత, రైతులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్నస్టేట్ బ్యాంకు, రెడ్ క్రాస్ సిబ్బంది

చిలకలూరిపేట స్టేట్ బ్యాంకులో రక్తదాన శిబిరం

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట సెంటర్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఉన్న స్టేట్ బ్యాంకు బ్రాంచీలు, రెడ్‌క్రాస్ సంస్థ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంకు ఉద్యోగులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రక్తదానం చేశారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఇండియా చీఫ్ మేనేజర్ రంగరాజన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గీతాంజలి పాఠశాలలో యోగా మాసోత్సవం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న యోగా మాస్టార్ లింగరాజు, కౌన్సిలర్ షకీలా బేగం

వినుకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు ఘనంగా యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ పాల్గొని విద్యార్థులకు యోగా ప్రాధాన్యం గూర్చి వివరించారు. కౌన్సిలర్ షకీలా బేగం మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, యోగా గురువులు లింగరాజు, గీతాంజలి డైరెక్టర్ కిశోర్, మున్సిపల్ ఏఈ ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి దాతల సహకారం అభినందనీయం

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరు కళామందిర్ సెంటర్ సమీపంలోని అంగనవాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన గవదగడ్డ పున్నయ్య 25 స్టీలుప్లేట్లు, 25 స్టీలుగ్లాసులు, గోరింట్ల శ్రీనివాసరావు మంచినీళ్ళ క్యాన్లను గురువారం విరాళంగా సమర్పించినట్లు తెలిపారు. చలపతిరావు మాట్లాడుతూ ఇటీవల దాతలు సమర్పించిన విరాళాలు రూ.33వేలతో అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీలు, నీళ్ళక్యాన్లు, ఇనుపడిఊయల, ఫ్లెక్సీలు, ఆటబొమ్మలు తదితర వస్తువులను ఏర్పాటు చేశామని, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ వేశామని, ఆవరణను చదును చేయించామన్నారు. దాతల సహకారంతో మోడల్ అంగనవాడీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ వెల్లలచెరువు అనురాధ, దాతలు సుజాత, ధనలక్ష్మి, పుష్పాంజలి, రాజేశ్వరి, నాగేంద్రం పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

● టీడీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథం

బొందిలిపాలెం (శావల్యాపురం) జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నూతనంగా ఎన్నుకైన కార్యవర్గసభ్యులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి కృషిచేయాలని జిల్లా టీడీపీ కార్యదర్శి గడిపూడి విశ్వనాథం అన్నారు. మండలంలోని బొందిలిపాలెంలో టీడీపీ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికను బుధవారం రాత్రి నిర్వహించారు. టీడీపీ అధ్యక్షుడిగా పాపసాని హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా బండి తిరుపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు సీనియర్ నాయకులు పార్టీకండువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గోపాళం శివయ్య, మాజీ గ్రామపార్టీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకట్రావు, పి.వెంకట్రావు, సీనియర్ నేతలు చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, బాలాజీసింగ్ పాల్గొన్నారు.

సుగాలీ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల బహూకరణ

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుగాలీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు జనసేనపార్టీ చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజారమేష్ గురువారం రూ.10 వేల విలువ కలిగిన కుర్చీలను బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మునీర్‌హసన్, పటాన్ ఖాదర్‌బాషా, కూరపాటి శివశంకర్, రాజేష్, కరిముల్లా, అచ్చు కోల వెంకటప్పయ్య, రాములు నాయక్, నంబూరి అంజిబాబు, కోటా నాయక్, మోతిబాయి పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మ తల్లి కొలుపులు

ఈపూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులో వారం రోజుల నుంచి జరుగుతున్న అంకమ్మ కొలుపులు గురువారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామస్థులు అంకమ్మ తల్లికి బోనాల సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల

బొల్లాపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు తండాలో పోలేరమ్మ తిరునాళ్ళ గురువారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

బడిబయటి పిల్లలు పాఠశాలల్లో చేరాలి: రాజారమేష్

శావల్యాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బడిబయటి పిల్లలంతా పాఠశాలల్లో చేరాలని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిక్కా రాజారమేష్ అన్నారు. మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని తుమ్మకుంటలో బడి బయటి పిల్లల తల్లిదండ్రులను కలసి పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించి పాఠశాలలో చేర్పించారు. అనంతరం పోట్లూరులోని జడ్పీపాఠశాల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకం రిజిస్టర్‌లను హెచ్ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఆవిష్కరించారు.

చిలకలూరిపేటలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినం

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కాంగ్రెస్ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో లౌకికవాదాన్ని కాపాడగలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు .కాంగ్రెస్ నాయకులు ఎం.రాధాకృష్ణ, షేక్ బాజీ, అద్దంకి అనిల్ కుమార్, షేక్ నసురుద్దీన్, సాగి నరసింహారావు, ఇంటూరి భవాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు శ్రీనివాసరావు, వీవీఎస్ రత్నకళ

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్యాలిఫోర్నియాలోని తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (టెల్సా) ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించారు. టెస్లా సంస్థ అధ్యక్షుడు మల్లిక్ కేశవరాజు, మాజీ అధ్యక్షుడు మురళి చందూరి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పాపారావు రాళ్ల, బండి మూర్తి దాతృత్వంతో 1-5 తరగతులకు చెందిన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారులు ఏ శ్రీనివాసరావు, వీవీఎస్ రత్నకళ పాల్గొన్నారు. మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు కూడా పుస్తకాలు త్వరలో అందచేస్తామని టెస్లా ప్రతినిధులు తెలిపారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

నరసరావుపేట టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో 15మందికి రూ.17లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకున్నవారు మాట్లాడుతూ వైద్యసాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్ర వేడుకలకు గిన్నిస్ రికార్డు ఖాయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి



విశాఖపట్నం ఆర్‌కే బీచ్ వద్ద యోగాంధ్ర వేడుకల ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న విశాఖపట్నం ఆర్‌కే బీచ్ వద్ద కనీవినీ ఎరుగని విధంగా నిర్వహించనున్న యోగాంధ్ర వేడుకలు గిన్నిస్ రికార్డులకు ఎక్కడం ఖాయమని, రాష్ట్ర జనాభాలో 25శాతమైనా నిత్యం యోగా చేసేలా చూడాలన్నదే యోగాంధ్ర నిర్వహణ ప్రధానోద్దేశమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తెలిపారు. విశాఖ బీచ్‌లో జరుగుతున్న యోగాంధ్ర నిర్వహణ ఏర్పాట్లు, ప్రధాన వేదిక నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు యువకుడిలా ఉత్సాహంగా పనిచేయడానికి కారణం యోగానే అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశకత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. యోగాంధ్ర వేడుకల్లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరికీ క్యూ ఆర్ కోడ్ కేటాయించిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

సబ్‌డివిజన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

● సర్వేశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్




సర్వేశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్ సురేంద్ర

యడ్లపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్పీ నంబర్లతో ఇబ్బందిపడుతున్న రైతులు సబ్ డివిజన్‌కు దరఖాస్తు చేసుకోవాలని నరసరావుపేట డివిజన్ సర్వేశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. గురువారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్‌తో సమావేశమై రీ సర్వేకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా జాయింట్ ఎల్‌పీ నంబర్ల సబ్ డివిజన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రీ సర్వేలో ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువమంది రైతులకు జాయింట్‌గా ఒకే ఎల్‌పీ నంబరు కింద నమోదు చేయడం వలన విస్తీర్ణం అధికంగా చూపుతోందన్నారు. దీంతో అర్హత ఉన్నా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాల లబ్ధిని సదరు రైతులు పొందలేకపోతున్నారన్నారు. నరసరావుపేట డివిజన్‌లో 6,416 జాయింట్ ఎల్‌పీ నంబర్లు ఉండగా యడ్లపాడు మండలానికి సంబంధించి 1,872 ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాయింట్ ఎల్‌పి నంబర్లను సబ్‌డివిజన్ చేస్తున్నట్లు చెప్పారు. రూ.50రుసుం చెల్లించి గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఈ నెల 30లోపు సబ్ డివిజన్ ప్రక్రియ పూర్తిచేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేంద్ర ఉన్నారు.

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



యోగాలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ యోగా ప్రాధాన్యం ప్రపంచానికి తెలియజేసేలా దేశ ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న వైజాగ్ మహానగరంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు జనసేన నేతల పరామర్శ




రైతు కుటుంబాలతో మాట్లాడుతున్న జనసేన నేతలు వెంకటేశ్వరరావు తదితరులు

నాదెండ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవటం బాధాకరమని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. సమన్వయకర్త తోట రాజా రమేష్‌తో పాటు పార్టీ నాయకులతో కలసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆదినారాయణ, గోపాలరావుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుభానీ, మునీర్ హసన్, శరత్, రామారావు, సాంబ, హర్షవర్దన్, జగదీష్, వెంకటప్పయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నివేదన

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



విశేషం

యోగాకు మతంతో సంబంధం లేదు!

భారత ఉపఖండానికి యోగ విద్య కొత్తదేం కాదు. వేల ఏళ్ళ క్రితమే భారతీయులకు యోగ సాధన తెలుసని రుజువుపరిచే పురావస్తు ఆధారాలెన్నో లభించాయి. సామాన్య శక పూర్వం (బీసీఈ) 2500 కాలం నాటి సింధు నాగరికతకు చెందిన కొన్ని మట్టి ముద్రల మీద... యోగాసన భంగిమలలో కూర్చొని తపస్సు చేస్తున్న సాధకుల బొమ్మలు ఉన్నాయి. ఇవి నేటి పాకిస్తాన్‌లోని లార్కానాలో... మొహెంజదారో శిథిలాలలో బయటపడ్డాయి. అలాగే బీసీఈ 1500 నాటి ఋుగ్వేద మంత్రాల్ని పరిశీలిస్తే నాటి ప్రజలకు అప్పటికే యోగాభ్యాసం గురించి తెలుసునని గ్రహించగలం. వివిధ ఉపనిషత్తులు, భగవద్గీత (ఆత్మ సంయమ యోగం)లో యోగ సాధన ప్రయోజనాలు, మార్గాలు విపులంగా చర్చించారు. ప్రాచీన కాలంలో యోగ సాధనను అందరూ శారీరక, మానసిక ఆరోగ్య ప్రదాయినిగా భావించారు. అయితే... యోగ సాధన ఫలితాల గురించి భారతీయులలో పలు అశాస్త్రీయ విశ్వాసాలు కూడా క్రమంగా ఏర్పడ్డాయి.

ఇతర మతాల్లోనూ...

కొందరు భావిస్తున్నట్టు యోగా కేవలం సనాతన (హిందూ) ధర్మానికి సంబంధించిన సాధన మాత్రమే కాదు. వైదికేతరమైన జైన, బౌద్ధానుయాయులు, ఇస్లామ్ మతానికి చెందిన సూఫీలు, దర్వేషీలు కూడా యోగ సాధన చేస్తారు. తాంత్రిక బౌద్ధ శాఖ అయిన 'వజ్రయానం'లో యోగాసనాలకు, ప్రాణాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బౌద్ధ గ్రంథమైన 'దీర్ఘనికాయం'లో వీటి ప్రస్తావనలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం పునాదిగా, బౌద్ధం ద్వారా ప్రభావితుడైన పతంజలి మహర్షి 'యోగ సూత్రములు' అనే గ్రంథం రచించి, యోగను ఎనిమిది అంగాలతో కూడిన సమగ్ర సాధనంగా రూపొందించాడు. వేదాలను ప్రమాణాలుగా భావించే భారతీయ షట్ (ఆరు) ఆస్తిక దర్శనాలలో యోగ దర్శనం ఒకటి. కపిల మహర్షి రూపొందించిన సాంఖ్య దర్శనం... నిరీశ్వర (దైవం ప్రస్తావన లేని) సిద్ధాంతం కాగా... దాని ఆధారంగా పతంజలి రచించిన 'యోగ సూత్రాలు' దానికి దైవం, మోక్షం లాంటి భావనలను జోడించాయి. అందుకే పతంజలి యోగ సిద్ధాంతానికి 'సేశ్వర (స+ఈశ్వర) సాంఖ్యం' అనే పేరు వచ్చింది. 'యోగ' అనే మాటకు 'ఉపాయం, కూర్పు, కలయిక' అనే సాధారణ అర్థాలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం ఆత్మను 'పురుషుడు' అని, పదార్థాన్ని 'ప్రకృతి' అని వ్యవహరిస్తూ... అవి రెండూ అంతిమ సత్యాలని నమ్ముతుంది. శుద్ధ చైతన్య స్వరూపుడైన పురుషుడు (ఆత్మ) పదార్థ జనితమైన చిత్తంతో చెందే సంయోగం కారణంగా వివిధ చిత్తవృత్తుల (మెంటల్ మోడిఫికేషన్స్)కు లోనవుతాడని, తన స్వభావ సిద్ధమైన వివేక జ్ఞానాన్ని కోల్పోతాడని, చిత్తవృత్తులను నిరోధించి, వివేక జ్ఞానం పొందడం ద్వారా మోక్షాన్ని సాధించే మార్గమే యోగమని పతంజలి సిద్ధాంతం.

శాస్త్రీయ దృక్పథంలో...

ఇప్పుడు దీన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిద్దాం. సిద్ధాంతపరంగా మిగిలిన అయిదు ఆస్తిక దర్శనాలు ఎదుర్కొన్న తార్కికమైన, తాత్త్వికమైన చిక్కులనే యోగ దర్శనం కూడా ఎదుర్కొంది. యోగ సాధన ద్వారా దైవ స్వరూపం అవగతమవుతుందని, పలు సిద్ధులు, అతీంద్రియ శక్తులు లభిస్తాయని యోగ సూత్రాలలో పేర్కొన్న విషయాలను కొందరు విశ్వసిస్తారు. అయితే వాటికి శాస్త్రీయ ఆధారాలను మాత్రం చూపలేరు. అయితే మన శారీరక, మానసిక ఆరోగ్యాలకు యోగసాధన ప్రయోజనకరమని మాత్రం శాస్త్రీయంగా రుజువయింది. యోగాసనాల వల్ల పలు శరీరావయవాలకు, మెదడుకూ రక్తప్రసరణ మెరుగుపడుతుందని, అనేక శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని నిరూపితం అయింది. 'అష్టాంగయోగ' సాధనలో అంతర్భాగమైన ప్రాణాయామం ద్వారా శ్వాసకోశాలు శుభ్రపడి, రక్తశుద్ధి మరింత చక్కగా జరుగుతుంది. గుండె పనితీరు మెరుగుపడుతుంది. ధారణ ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవుతాయి. ధ్యానం చిత్తశుద్ధినీ, ప్రశాంతతను చేకూరుస్తుంది. యోగ సాధన ప్రయోజనాలు వైద్య విజ్ఞాన శాస్త్రవేత్తల అధ్యయనాల్లో రుజువయ్యాయి. అంతేతప్ప అతీంద్రియ శక్తులు లభిస్తాయని ఎవరూ రుజువు చేయలేదు. అందుకే వాటిని అంధ విశ్వాసాలుగా విజ్ఞులు, శాస్త్రవేత్తలు కొట్టి పారేస్తారు. కాగా... శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతో మేలు చేకూర్చే యోగ సాధనను కొందరు మత విశ్వాసాలతో ముడిపెడుతున్నారు. యోగ శిక్షణ తరగతులలో చేసే సాధనను భక్తి, ప్రార్థనలు, భజనలతో మిళితం చేస్తున్నారు. యోగ సాధనకు మత విశ్వాసాలతో ఎలాంటి సంబంధం లేదని, ఏ మతస్థులైనా యోగ సాధన చేసి పొందవచ్చని, ఎందరో అలా పొందుతున్నారని అందరూ గ్రహించాలి.



ముత్తేవి రవీంద్రనాథ్
చరిత్ర పరిశోధకుడు

అష్టాంగ యోగం

చిత్తవృత్తులను నిరోధించడమే యోగమని చెబుతూ... 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి' అనే ఎనిమిది అంగాలను పతంజలి వివరించాడు. ఈ ఎనిమిది అంగాలు కలిగిన యోగ సాధనను 'అష్టాంగ యోగం' అంటారు. వాటిలో మొదటి అయిదు బహిరంగ సాధనాలని, మిగిలిన మూడు అంతరంగ సాధనలని పేర్కొంటారు. యమ, నియమాలు సాధకులకు నైతిక క్రమశిక్షణ చేకూర్చితే... ఆసన ప్రాణాయామాలు సాధకుల శరీరారోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. 'ఆసనం' అంటే శరీరాన్ని ఒకే స్థితిలో నిశ్చలంగా ఉంచగలగడం. 'ప్రాణాయామ సాధన' అంటే మనం పీల్చే ప్రాణవాయువును వివిధ విధాలుగా బిగబట్టి, వదులుతూ చేసే ఆయామం (నియంత్రణ). 'ప్రత్యాహారం' అంటే సాధకులు తమ పంచేంద్రియాలను, మనస్సును విషయ వాంఛలకు దూరంగా ఉంచడం. సాధకులు 'భ్రుకుటి' (కనుబొమల మధ్య ప్రదేశం), 'నాసాగ్రం' (ముక్కు కొన) లాంటి వాటిపై దృష్టి కేంద్రీకరించి... ఏకాగ్ర సాధన చేయడాన్ని 'ధారణ' అంటాం. మనస్సును నిరంతరం ఒకే విషయం మీద లగ్నం చెయ్యడాన్ని 'ధ్యానం' అని పిలుస్తారు. ధ్యానం కూడా ఆగిపోయి... ఆత్మ, మనం ధ్యానం చేసే విషయం... ఈ రెండూ ఒకటై పోయే దశను 'సమాధి స్థితి' అంటారు.

సహజయోగ

విశ్వశాంతి మంత్రం

ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీనికి మతాలు, జాతులు మధ్య వైరాలు, సరిహద్దుల కోసం, ఆధిపత్యం కోసం పోరాటాలు... ఇలా ఎన్నో కారణాలు. ఈ యుద్ధ వాతావరణంలో అమాయకమైన ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. విశ్వశాంతికి భంగం కలిగిస్తున్న అనేక సమస్యలకు యోగా చక్కటి పరిష్కారాన్ని చూపిస్తుంది. 'మన కోసం, మన సమాజం కోసం యోగా' అనే నినాదంతో... జూన్ 21వ తేదీని 'అంతర్జాతీయ యోగా దినం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. జీవితానికి శాంతిని, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును అందించే ప్రక్రియ యోగా. సహజయోగ ధ్యాన ఆవిష్కర్త శ్రీమాతాజీ నిర్మలాదేవి విశ్వశాంతి స్థాపన ధ్యేయంగా పలు దేశాల్లో పర్యటించినప్పుడు ఇచ్చిన సందేశాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.

ఆ కలయికే యోగా...

ఈ రోజుల్లో చాలామంది యోగ అంటే కేవలం ఆసనాలు, సూర్యనమస్కారాలు అనుకుంటున్నారు. నిజానికి ఆ పదానికి అర్థం చాలా విస్తృతమయినది, ఎంతో సూక్ష్మమైనది. సంస్కృత భాషలో 'యోగ' అనే పదానికి 'కలయిక' అనే అర్థం ఉంది. ప్రతి మానవునిలో అంతర్గతంగా ఉండే భగవంతుని శక్తి జాగృతం చెంది, మన చుట్టూ సర్వవ్యాపితమై ఉన్నభగవంతుని శక్తితో కలయిక చెందడాన్నే 'యోగ' అని పిలుస్తారు..

శాంతి మనలో ఉండాలి



వేదికల మీదకు ఎక్కి... 'శాంతి, శాంతి' అని గొంతెత్తి అరచినంతమాత్రాన ప్రపంచంలో శాంతి స్థాపన చేయలేం. మనిషిలోనే ప్రశాంతత లేనప్పుడు శాంతి సాధన కోసం చర్చలు జరపడం వల్ల ఫలితం ఏముంటుంది? ఒక వేళ శాంతికోసం చర్చలు జరిపినా, ఒప్పందం చేసుకున్నా... ఏదో ఒక రూపంలో మళ్ళీ అశాంతి మొదలవుతుంది. మనలోని ఆత్మ ద్వారా శాంతి వ్యక్తం కావాలి. ముందుగా శాంతి అనేది మనలో ఉండాలి. మనం మానసిక ప్రశాంతతతో ఉండాలి. మనలో అశాంతి ఉన్నప్పుడు, అహంకారంతో మన కళ్ళు మూసుకుపోయినప్పుడు 'నేనెంతో ప్రశాంతంగా ఉన్నాను' అని భావిస్తే... అది కేవలం భ్రమ. శాంతి కోసం యుద్ధాలు చేయనవసరం లేదు. దాన్ని ఆత్మ ద్వారా అనుభూతి చెందాలి. అంతర్గతంగా ప్రశాంతతతో ఉన్నవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు. అందరికీ ఆనందాన్ని పంచుతారు. ప్రతి మనిషిలో నిద్రాణ స్థితిలో ఉన్న దైవ శక్తి అయిన కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మన హృదయానికి, మెదడుకు మధ్య ఐక్యత ఏర్పడుతుంది.

అదే సహజయోగం. ఆ కాంతి మనలో ప్రవేశించినప్పుడు... మన జీవితం నెమ్మదిగా, స్థిరంగా మారడం, పరివర్తన చెందడం గమనిస్తాం. అప్పుడు మానవులలో అత్యున్నత శ్రేణికి చెందిన కొత్త కోణాన్ని మనం చూస్తాం. రూపాన్ని గురించి చింతించడం, ప్రత్యేకమైన ఇష్టాలు, అయిష్టాలు, అనవసరమైన ఆలోచనలు లాంటివి ఉండవు. మనలో శాంతి క్రమంగా స్థిరపడడం ప్రారంభమవుతుంది. మనలో స్థిరపడిన ఈ అంతర్గత శాంతి మనల్నే కాదు... మన చుట్టూ ఉన్న సమాజాన్ని, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. అలా విశ్వశాంతికి దోహదపడే మంత్రమే యోగా.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

సద్గురువాణి

ఆ అద్భుతాన్ని అనుభూతి చెందుదాం

'యోగా' అంటే 'మీ శరీరాన్ని ఎలా వంచాలి? లేదా శ్వాసను ఎలా బిగబట్టాలి?' అనే దాని గురించి కాదు. ఇది మొత్తం మానవ వ్యవస్థను అర్థం చేసుకొనే విజ్ఞాన శాస్త్రం. 'యోగ' అనే పదానికి అర్థం ఐక్యత . ఐక్యత అంటే 'మీరు' అనే దానిలోంచి విశ్వజనీనతను అనుభూతి చెందడం. ఉదాహరణకు... ఈ అస్తిత్వం అంతా వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్న ఒకే శక్తి అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిరూపించింది. ఈ శాస్త్రీయ వాస్తవం మీకు జీవన వాస్తవంగా మారితే... అంటే మీరు ప్రతిదాన్నీ ఒకటిగా అనుభూతి చెందడం ప్రారంభిస్తే... మీరు యోగాలో ఉన్నట్టే.

మీలోపల ఏం జరుగుతోంది?

ఈ అంతర్గత సాంకేతికతను మానవులకు అందించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ రోజున ఐక్యరాజ్యసమితిలోని నిపుణులు 'మానసిక అనారోగ్యం' అనే మహమ్మారి గురించి మాట్లాడుతున్నారు. ప్రపంచంలో ఒంటరితనం ఎక్కువైపోతోంది. యునైటెడ్ స్టేట్స్‌లో... సర్జన్ జనరల్ నివేదిక ప్రకారం ప్రతి ఇద్దరిలో ఒకరు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఒంటరితనంలో గడిపే సమయం... మానసిక అనారోగ్యాలను పొదిగే సమయం. మానసిక అనారోగ్యం కేవలం కొన్ని రకాల వ్యక్తులనే కాదు... ఎవరినైనా ప్రభావితం చేయవచ్చు. మీరు ఆ స్థితికి వెళ్ళకుండా చూసుకోవడం ఉత్తమం. ఎందుకంటే బాధ, ఆనందం, సంతోషం, దుఃఖం, ఆవేదన, పారవశ్యం లాంటి వాటిద్వారా మానవ అనుభవం అనేది అంతర్గతంగా నిర్ణయం అవుతుంది. బాహ్య సంఘటనలు... ఆఖరికి ఒకే కుటుంబం లోని ఇద్దరు సభ్యుల మధ్య కూడా ఎప్పుడూ నూటికి నూరు శాతం మీరు కోరుకున్నట్టు జరగవు. కానీ మీలో అంతర్గతంగా ఏం జరుగుతోందనేది మీరే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

వారే కర్తలుగా, యజమానులుగా...


ఈ సమస్యను పరిష్కరించడం కోసం... ఈ ఏడాది ఫిబ్రవరిలో మేము 'మిరాకిల్ ఆఫ్ మైండ్' అనే యాప్‌ను ప్రారంభించాం. ఇది ఒకరి జీవితంలో శాంతిని, ఆనందాన్ని, ఉల్లాసాన్ని తీసుకురావడానికి దోహదపడే, ఎక్కడైనా సాధన చేయగలిగే సులభమైన ప్రక్రియను అందిస్తుంది. ఇది తెలుగుతో సహా పలు భాషల్లో ఉంటుంది. ప్రత్యేకించి తెలుగులో ధ్యానం కోసం అందుబాటులోఉన్న మొదటి యాప్ ఇది. ఈ భూమి మీద ఉన్న ప్రతి మానవుడు మనసు చేసే అద్భుతాన్ని అనుభూతి చెందాలనేది నా కోరిక, నా ఆశీస్సు. మానవులందరూ ఏ మినహాయింపు లేకుండా... తమ ఆనందానికి తామే కర్తలుగా, తమ భవితకు తామే యజమానులుగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. మీరు ఆ విధంగా రూపుదిద్దుకొనే మార్గాన్ని యోగా అందిస్తుంది. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ఈ అత్యంత ముఖ్యమైన కార్యానికి సాయం చేయడానికి, నెరవేర్చడానికి అందరికీ సుస్వాగతం. ఎందుకంటే ప్రస్తుతం మనకన్నా మెరుగైన తరం మానవులను లోకానికి అందించి నిష్క్రమించడం మనం విస్మరించలేని బాధ్యత.



సద్గురు
జగ్గీవాసుదేవ్

తెలుసుకుందాం

బ్రాహ్మీ ముహూర్తం అంటే...



'బ్రాహ్మీ ముహూర్తం' అనే మాట మనం వింటూనే ఉంటాం. అది తెల్లవారుజాము సమయం అని అందరికీ తెలుసు. కానీ సరైన సమయం మాత్రం చాలామందికి తెలియదు. అలాగే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలని, పూజ చేయాలని, పిల్లలు చదువుకోవాలని ఎందుకు సూచిస్తారో తెలుసుకుందాం. సూర్యోదయానికి ముందున్న 48 నిమిషాల సమయాన్ని 'బ్రాహ్మీముహూర్తం' అంటారు. ఇది పూజలకు, జపాలకు, మంత్రసాధనకు విశిష్టమైనదని పూర్వులు చెప్పారు.

ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి...

మన శరీరంలోని జీవక్రియలన్నీ మన లోపల ఉండే జీవ గడియార సమయం ప్రకారం జరుగుతాయి.
బ్రాహ్మీ ముహూర్తంలో మేలుకొనేవారికి జీవక్రియ సక్రమంగా సాగుతుంది. ఎందుకంటే ఉదయం వేళ మన శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల అవుతుంది.
ఈ హార్మోన్ మనలోని ఒత్తిడిని తగ్గించి, జ్ఞాపకశక్తిపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. అందుకే విద్యార్థులు ఆ సమయంలో చదువుకుంటే బాగా గుర్తుంటుందని, వారి జ్ఞాపకశక్తి పెరుగుతుందని విశ్వాసం ఉంది. అలాగే ఆ సమయంలో పరిసరాలు నిశ్శబ్దంగా ఉంటాయి. కాబట్టి చదివినది నేరుగా మెదడులో నిక్షిప్తం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాత్రి తొందరగా నిద్రపోయి, సూర్యోదయానికి ముందే లేచేవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా రావంటోంది ఆయుర్వేదం. రాత్రంతా చెట్లు విడుదల చేసిన ఆక్సిజన్... వేకువ జామున కాలుష్యం బారిన పడకుండా ఎక్కువ పరిమాణంలో మనకు అందుబాటులో ఉండేది బ్రాహ్మీ ముహూర్త సమయంలోనే. ఉదయం నడకకు వెళ్ళేవారికి ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రతిరోజూ సూర్యోదయాన్ని చూసే అలవాటు ఉన్నవారి గుండె, మెదడు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటాయి. లేలేత సూర్యకిరణాలు మనపైన ప్రసరించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. సూర్యరశ్మిలో ఉండే 'విటమిన్-డి' మన ఎముకలు బలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.

• సి.ఎన్. మూర్తి,అంబాజీపేట
8328143489

సమాచారం

ఆదిపరాశక్తిని తమ ఇంటి ఆడబిడ్డగా భావించి, అత్తవారి ఇంటి నుంచి పుట్టింటి తీసుకువచ్చి, నైవేద్యాలు సమర్పించి, సారెతో అత్తవారింటికి తిరిగి సాగనంపే సంప్రదాయమే బోనాల పండుగ.

ఆషాఢ జాతర వచ్చేస్తోంది!



ఆషాఢమాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో మొదలై, నెలరోజులపాటు జరిగే ఈ పండుగ ఎన్నో విశేషాల సమాహారం. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకూ ఈ వేడుకలు కొనసాగుతాయి.

ఎక్కడంటే...

జూన్ 26న: గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం
జూలై 29న: విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పణ
జూలై 13న: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర
జూలై 14న: రంగం, భవిష్యవాణి
జూలై 20న: భాగ్యనగర్ (లాల్ దర్వాజా) బోనాల జాతర
జూలై 21న : ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు
జూలై 24న: బోనాల ఉత్సవాల ముగింపు

వ్యాసపీఠం


హరే శ్రీనివాస!

దాదాపు రెండేళ్ళపాటు టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ అధికారిగా... స్వామి వారి ప్రథమ సేవకుడిగా తాను చేసిన విశేష కార్యక్రమాలను వివరిస్తూ డాక్టర్ కె.వి.రమణాచారి రచించిన గ్రంథం 'హరే శ్రీనివాస!'. ఇందులో 'శ్రీనివాసుడు నాకు జవాబిచ్చాడు' మొదలు 'వెంకటాద్రి దిగి వెంకటాద్రి ఎక్కివరకూ'... ఇరవై రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల శీర్షికలు వాటిని చదవాలన్న ఉత్సుకతను పాఠకుల్లో రేకెత్తిస్తాయి.

"ఎందుకు ఈ భక్తులందరూ వందలాది కిలోమీటర్ల దూరం రైళ్ళు, బస్సులు, కార్లు, కాలినడక... ఇలా ఇన్ని రకాలుగా ఆపసోపాలు పడుతూ తిరుపతి వస్తున్నారు?..." అనే ప్రశ్నతో ఈ గ్రంథం ప్రారంభం అవుతుంది. "నిన్నే తమ సర్వస్వంగా భావిస్తున్న భక్తులు నిన్ను దర్శించాలని ఇంత కష్టపడి, ఇంత దూరం వస్తే నువ్విచ్చే దర్శనం లిప్తకాలమా?..." అనే ప్రశ్నను... తను టి.టి.డి. ఈవో కాకముందు డాక్టర్ రమణాచారిగారు తనలోతాను అనేకసార్లు వేసుకున్నారట. అలాగే "సర్వశక్తిమంతుడివి కదా! నీ భక్తుల దగ్గరకు నీవే వెళ్ళి, సంతృప్తికరమైన దర్శనంతో వాళ్ళను తరింపజేయవచ్చు కదా! స్వామే భక్తుల దగ్గరకు ఎందుకు వెళ్ళకూడదు?..." ఇది భక్తుడిగా ఆయన స్వామివారికి వేసిన ప్రశ్న. టి.టి.డి. ఈవోగా బాధ్యతలు స్వీకరించాక ఆ ప్రశ్న ఆయనలో మళ్ళీ ఉదయించింది. దానికి స్వామి ఇచ్చిన సమాధానం ఏమిటి? అది ఇచ్చిన పద్ధతి ఏమిటి? 'చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర'కు బీజం ఎలా పడింది? వీటన్నిటికీ జవాబులు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఆ సర్వాంతర్యామి సేవకుడిగా తన అనుభవాలను ఆసక్తికరంగా, సభక్తికంగా ఈ పుస్తకంలో డాక్టర్ రమణాచారి నిక్షిప్తం చేశారు.

ఆసక్తి పెంచేలా...

డాక్టర్ రమణాచారి తలపెట్టి విజయవంతం చేసిన చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర, అఖండ హరినామ సంకీర్తన, నిత్యకళ్యాణం, పుస్తక, ప్రసాదం, దివ్య భారతి, ఎస్వీబీసీ, శ్రీ అన్నమాచార్య ఆరువందల జయంతి వేడుక, పాలకమండలి అమృతోత్సవం... ఇలా ఎన్నో కార్యక్రమాలు, ప్రాజెక్టుల గురించి చదువుతూ ఉంటే... ఆయన భక్తి తత్పరత, పాలనానుభవం, కార్యదక్షత ఎంతటివో అర్థమవుతుంది. ఈ గ్రంథం చదవడం ప్రారంభిస్తే... పూర్తి అయ్యేవరకూ ఆగలేం. రచన అటువంటిది. విషయం భగవంతునిది. రచయిత పండిత, సంప్రదాయ కుటుంబానికి చెందినవారు. ఎం.ఏ. తెలుగు చేసి, పిహెచ్.డి. పట్టా పుచ్చుకున్నావారు. వీరి రచనలో చదివించే లక్షణం ఉంది. పఠనాసక్తిని పెంచే విధంగా శీర్షికలు ఉన్నాయి. తన ఆలోచనను చెప్పి, దాన్ని అమలుపరిచే క్రమంలో ఎదురైన సమస్యలను వివరిస్తున్న సందర్భంలో... పాఠకుని మనసు మరింత వేగంగా పరిగెడుతుంది. 'సమస్య ఎలా పరిష్కారమవుతుంది? దైవ కార్యం ఎట్లా విరబూసి పరిమళిస్తుంది?' అనే ఆసక్తిని పెంచే విధంగా రచన సాగింది. పుస్తకం ముగించినప్పుడు అనిపిస్తుంది... 'ఇంతలోనే నూట ఎనభై పుటలు చదివేసినామా!' అని. డాక్టర్ కె.వి.రమణాచారిగారి ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి పాఠకులకు అందించిన ప్రసాదం ఈ 'హరే శ్రీనివాస!' గ్రంథం.



• అనుమాండ్ల భూమయ్య